# చేదు పాత్ర

★

శ్రీ పెద్దిభొట్ల సుబ్బరామయ్య

శ్రీహరిరావుకు మెలకువ వచ్చి కళ్లు విప్పి చూడగానే కిటికీలోనుంచి ఉదయకాలపు ఎండతళతళమెరుస్తూ కనిపించింది. అతడు ఆదుర్దాగా లేచి 'టైమెంత అయిందో!' అనుకుంటూ గుమ్మం దాటి ఇవతలికి వచ్చాడు. .... వరండాలో ఎవరూ లేరు. బాగా పొద్దెక్కినట్టున్నది.

అతడు హడావిడిగా పెరటి గుమ్మంలోకి వెళ్లి కిటికీలో ఉన్న పళ్లపొడి పొట్లం చేతిలో విదిలించుకుంటూ "పరీక్షవేళ మించిపోయినట్టున్నది. దరిద్రదేవత ముసించినట్టు యివాళ యిలా మొద్దు నిద్ర పట్టిందేమిటి? పైగా లెక్కల పరీక్ష .... అరగంట దాటితే పరీక్ష హాల్లోకి రానివ్వరు కూడాను ...." అనుకుంటూ రెండు నిముషాల్లోనే త్వర త్వరగా దంత ధావనం ముగించి, నీళ్లు పుక్కిలించి ఉమ్మి వేసి, పై పంచెతో ముఖం తుడుచుకుంటూ వంట యింట్లోకి వచ్చాడు.

అతని అక్కగారు వంట గదిలో కుంపటి ముందు కూర్చున్నదలా తల పైకెత్తి 'ఏమిరా? యిప్పుడేనా లేవటం?' అన్నది. శ్రీహరిరావు గాభరాగా 'అప్పుడే మొహం కడుక్కోడం కూడా అయిందిలే ....' అన్నాడు. ఆమె "ఏమో! మీ బావగారు వాచీ చేతికి పెట్టుకుని పొద్దున్నే ఎటో వెళ్లిపోయారు. .... అయినా ఏడున్నర అయిందనుకుంటాను .... ఇవాళ పాల మనిషి కూడా రాలేదు. వేళకు కాఫీ లేకపోయేసరికి ఆయనకు బాగా కోపం వచ్చింది. ఉన్న పళంగా లేచి చక్కా వెళ్లిపోయారు ...." అంటున్నది.....

శ్రీహరిరావు గబగబా ముందు గదిలోకి పరుగెత్తిపోయాడు. ఒంకెకు తగిలించిఉన్న చొక్కా తొడుక్కున్నాడు. ఆ తొందరలో అసలే చిరుగుపట్టిఉన్న ఆ పాత ఖద్దరు చొక్కా మరి కాస్త చిరిగింది. దానిమీద తనకు మామూలుగా అలవాటైన గచ్చకాయ రంగు కోటు తొడుక్కున్నాడు. బల్లమీద ఉన్న కలం జేబులో పెట్టుకున్నాడు. వెనక్కు తిరిగి మధ్య గుమ్మానికి పైగా గోడమీద వ్రేలాడుతున్న వేంకటేశ్వర స్వామి పటానికి నమస్కారం చేశాడు. దాదాపు పరుగెత్తుతూనే వీధిలోకి వెళ్లి తర్వాత పెద్ద పెద్ద అంగలతో 'బస్ స్టాప్' చేరుకుని ఆదుర్దాగా బస్సుకోసం ఎదరు చూస్తూ నుంచున్నాడు.

ఈలోపల దాదాపు అరడజను మందిని, చేతులకు గడియారాలున్నవాళ్లను ఆదుర్దాగా టైమ్ అడిగి తెలుసుకున్నాడు. ఆ అరడజను వాచీలలోనూ టైము ఒక మోస్తరుగా లేదు. ఏడు గంటల ఇరవై నిముషాల నుంచి, ఏడూ నలభై అయిదు వరకూ రకరకాలుగా సమాధానాలు వచ్చాయి. అతడా ఆదుర్దాలో చేతికీ వెండి కడియం పెట్టుకున్న ఒక మనిషిని కూడా అలాగే అడగ్గా ఆ మనిషి నివ్వెరపోయి చూశాడు.

అసలే పరీక్షవేళ దాటిపోతున్నదని అతడు ఆదుర్దా పడుతూవుంటే బస్సు ఎంతకూ రాకపోవడం అతనికి మరింత బాధ కలిగించింది. మొహాన చెమట బిందువులు పొటమరిస్తూ ఉండగా ఆ ఉదయకాలపు ఉబ్బ ఎండలో కళ్లు చికిలించి రోడ్డు చివరి వరకూ నిర్నిమేషంగా చూస్తూ నిలుచుండిపోయాడు.

అతని మనస్సులో యిప్పుడు పరీక్షను గురించిన దిగులు తప్ప మరేమీ లేదు. అతడు ముప్ఫయి ఆరేళ్లవాడు. ఆ యీడులో మెట్రిక్ పరీక్ష వ్రాయవలసి రావటం అతనికేమంత ఆనందదాయకమైన విషయం కాదు. అతనికి నెలకు డెబ్భయి రూపాయల జీతం వచ్చే ఉద్యోగం ఉంది. అతడు ప్రస్తుతం కాపురం ఉంటున్నది పిడుగురాళ్లలో. అతని ఆఫీసు ఊరి బయట దూరంగా ఉంటుంది. అతని ఆఫీసులో సిరామరకలున్న టేబిలొకటి ఉంది. ఆ టేబిలుమీద అటూ యిటూ, యింకా క్రిందనూ మట్టిరంగు గవర్నమెంటు కాయితాలు కట్టలు కట్టలుగా ఉంటాయి. ఎవరెవరో కంట్రాక్టర్లు తమ తమ పనులకోసం ఆఫీసు చుట్టూ, ప్రత్యేకం ఆ సీటులో ఉన్న శ్రీహరిరావు చుట్టూ తిరుగుతూ ఉంటారు. తమ పనులు త్వరగా చేసిపెట్టినా, ఆఫీసరు దగ్గరికి తమ కాయితాలు త్వరగా వెళ్లేట్టు చూసినా వారు ఆ సీటులో ఉండే ఉద్యోగికి ఎంతో కొంత మామూలు ముట్టజెప్పటం తమ విధి అని అనుకుంటూ ఉంటారు. కాని, శ్రీహరిరావు వరుసక్రమంలో తన పనులు చెయ్యటం తప్ప ఇటువంటి ప్రలోభాలకు లొంగకపోవటం వారికి అట్టే నచ్చదు. పైగా ఆ తరహా మనుషులు అతని పరోక్షంలో మామూళ్లు లంచాలూ తీసుకోని కారణంగా "ఆఁ! వొట్టి పిచ్చివాడు ..." అనుకోవడం కూడా అతనికి తెలుసు. కాని అతని ఆఫీసరు మంచివాడనే చెప్పుకోవాలి. ఆయనకు శ్రీహరిరావును చూస్తే పై కారణంవల్లనే కొంచెం సానుభూతి. హుషారుగా ఉన్నప్పుడల్లా "ఏమయ్యా శ్రీహరీ! నలుగురు పిల్లల తండ్రివి కదా! ముసలి తల్లి ఉంది కదా? ఈ మూడు పాతికల జీతంలో పదిహేను రూపాయలు ఆ అద్దె కొంపకే చెల్లిపోతాయి కదా? మిగిలిన దాన్తో ఎలా సర్దుకుపోగలుగుతున్నా

వయ్యా ?'' అని అంటూవుండేవాడు. శ్రీహరిరావు అప్పుడప్పుడు తన ఇబ్బందులన్నీ చెప్పుకుని బాధపడిపోయేవాడు. అదీ చాలా అరుదుగానే .... ఎక్కువ సందర్భాలలో అటువంటి మాటలు వినగానే నవ్వి వూరుకునేవాడు. ఆఫీసర్ రెండు మూడుసార్లు, "భలేవాడివే! అలా నవ్వుతా వేమిటి పైగా ? నువ్వు చిన్నప్పుడు ఫోర్తుఫారం దాకా చదివా వన్నావుగదా! నామాటవిని ప్రైవేటుగా మెట్రిక్ పరీక్షకు కట్టి చదువు. అది కాస్త అయిందనిపించావంటే నాకు చేతనైన సహాయం చెయ్యగలను'' అన్నాడు. అది ఏమిటో శ్రీహరిరావుకు తెలుసు. ఆయన తనకు ప్రమోషన్ ఇప్పించగలడు. దానిమూలంగా తనకు మరొక పాతికా, ముప్ఫయి రూపాయిల మేరకు ఆదాయం పెరుగుతుంది. .... అతనిలో ఆశ పొటమరించింది. "అవును, తా నెందుకు పరీక్షకు కట్టి చదవకూడదు ?'' అనిపించింది. అనిపించిందే తడవుగా తన పాత ఉంగరం అమ్మి డబ్బు సమకూర్చుకొని ఫీజు కట్టేసి ఆ శుభవార్త ఆఫీసరుకు తెలియజేశాడు. ఆయన పెద్ద కొడుకు దగ్గరే పుస్తకాలు అప్పుడప్పుడు తీసుకొని కొన్నాళ్ల పాటు చదివాడు .... ఇంగ్లీషు, తెలుగులలో అతని కాట్టే బాధలేదు. చిన్నదీ, తక్కువదీ అయినప్పటికీ ఆ ఉద్యోగంలో అతడు పన్నెండేళ్లు పనిచేసి రకరకాల కాగితాలలో వ్యవహరించి ఉన్నందువల్ల ఇంగ్లీషుని గురించి అతను ఎక్కువ బాధపడలేదు. ఇంగ్లీషు పరీక్ష రోజున స్వంతంగా, చక్కని వాక్యాలతో జవాబులు వ్రాయగలిగాడు .... పోతే తెలుగు అతని కెన్నడూ సమస్య కాలేదు. అతడు చిన్నతనం నుంచీ కొద్దిగానో గొప్పగానో కావ్యపఠనం చేసినవాడు. భారత భాగవతాలు, తెలుగులో పంచ కావ్యాలు, స్థాలీపులాకంగా ఒక్కసారి తిరగవేశాడు కూడా. పైగా అభ్యాస వశాన పద్యరచన కూడా అలవడింది. అందువల్ల తెలుగు పరీక్షను అతడు సునాయాసంగా ఘనంగా పూర్తిచేశాడు..... ఇక తరువాతది లెక్కలు. ఇవాళ లెక్కల పరీక్ష అనే విషయం గుర్తుచేసుకొంటేనే అతనికి అధైర్యం పుట్టుకొని వస్తున్నది. మొదటి నుంచి అతనికీ, లెక్కలకూ ఎన్నడూ సరిపడలేదు. అతని ముప్ఫయి ఆరేళ్ల జీవితంలోను అతడు దేనికీ లెక్కలను గురించినంతగా భయపడలేదు. కొందరు లెక్కలలో నూటికి నూరు మార్కులు సంపాయించటం అతనికి చాలా చిత్రంగా కనిపించేది. లెక్కలను మించిన కొరకరానికొయ్యశాస్త్రం మరొకటి యీ ప్రపంచంలో లేదని అతని దృఢాభిప్రాయం. కూరల మనిషితో బేరసారాల దగ్గర నుంచి అప్పులిచ్చినవారు, పుచ్చుకొన్నవారూ వడ్డీలను గురించి వేసే బండ అంకెలనుంచి, బి. ఎస్‌సి చదువుతూన్న తమ ఇల్లు గలవారి అబ్బాయి రోజూ చేసే విచిత్రమైన ఆల్జీబ్రా, జామెట్రీ, ట్రిగ్నామెట్రీ వంటివాటి దాకా ఏ అంశమూ అతనికి అర్థంకాదు. ఎక్కడో పేచీ .... ఈ లెక్కలు నాగరక మానవుని అనవసరంగా శ్రమ పెడుతున్న పెనుభూతమనీ, లెక్క లనబడే సాలెగూడులో ఈగలా మానవుడు చిక్కుకు పోయినాడని అతని భావం. తెల్లవారి లేచింది మొదలూ పాలమనిషి దగ్గరి నుంచి ప్రతివారితోనూ లెక్కలతో పేచీయే .... నిత్యమూ అవసరమైన అటువంటి వాటితోనే బాధపడుతూవుంటే ఏమీ పనిలేనివా రెవరో తీరి కూర్చుని తిన్నది అరక్క ఆల్జీబ్రాలు, జామెట్రీలు కనిపెట్టి మన ప్రాణాలు తీశారు. 'ఏ' 'బి' లు కలిసి 'సి' అయితే మనకు ఏం ఒరిగి పడుతుందో, కాకపోతే మన ఒళ్లో పడబోయేది ఏది ఆగి పోతుందో అతనికి అర్థంకాదు. ఈ యీడులో యీ పరీక్షకు వచ్చినందుకు ఎక్కువమంది పసిపిల్లల మధ్య కూర్చుని పేపరు వ్రాయవలసి వచ్చినందుకూ అత డెక్కువ బాధ పడలేదు. .... లెక్కలతోనే బాధ అంతా. అందులో అతనికి ఆద్యంతాలు ఏమీ తెలియవు. ఆల్జీబ్రా, జామెట్రీలు సరేసరి. అంతా అయోమయం. ఇంక మిగిలింది సామాన్య గణితం. అందులోనూ మడతపేచీ లెక్కలు చాలా ఉన్నయ్. వాటి జోలికే తను పోలేడు. ఇంక మిగిలినవి కొని వడ్డీ లెక్కల వంటివి. అతనికి అర్థమైనట్టే ఉంటాయి. కాని సాధించబోతే కుదరవు. ఎన్నడూ ఏ లెక్కా సజావుగా శ్రమ పెట్టకుండా అతనికి లొంగిన పాపాన పోలేదు. "అసలు లెక్కలు తీసుకోవటం పెద్ద పొరపాటై పోయింది.'' అనుకున్నాడతడు కొన్ని నెలలు ప్రయత్నించి. తోటివారు కొంతమంది కూడా "సివిక్సో, హిస్టరీయో అయితే మన దిన పత్రిక విజ్ఞానం అంతా ఒలకపోసి పేపర్లు నింపినా మార్కులు పడిపోతయ్. ఈ లెక్కలు తీసుకొన్నా వెందుకోయ్!'' అన్నారు. అయినా అప్పు డిక చేసేదేమీ లేక మొండిగా, "సరే,, ఏది ఏమయినప్పటికీ ఇప్పుడిక తప్పదు.'' అనుకొని తయారయి వచ్చాడు. ఆఫీసరు దయతో వారం రోజులు సెలవు మంజూరు చెయ్యడమూ, అతడు మరొక ఊరికి వచ్చి అక్కడ అక్కగారింటో మకాంచేసి మొదటి రెండు రోజులూ పరీక్ష వ్రాయడమూ జరిగిపోయాయి. పరీక్ష హాల్లో అతడి ముందు బెంచీలో కూర్చుని పధ్నాలుగేళ్ల కుర్రవా డొకడు అద్భుతంగా అన్ని పేపర్లూ వ్రాయడం అతడు గమనించాడు. అతని పేరు రవి. ఎర్రగా, బక్కపలచగా ఉంటాడు. తెలివితేటలు జాలువారే ముఖం, ఉంగరాల జుట్టూ, పచ్చని శరీర ఛాయా, ముత్యాల వరుసవంటి దస్తూరీ శ్రీహరిరావును ఆకర్షించిన అంశాలు. అతడు ఆ క్రిందటి రోజున రవిని పరిచయం చేసుకొని ప్రాధేయపడుతూ, "నాకు లెక్కలు చాలా 'డౌటు'గా ఉందండీ. ఇవాళ రాత్రి ముఖ్యమైన లెక్కలు కొన్ని చెప్పగలరా ?'' అని అడిగాడు. అంతపెద్ద మనిషి అలా అడిగినందుకూ, పైగా తనను 'అండీ' అని మన్నిస్తున్నందుకూ అతడు నివ్వెరపోయి, తర్వాత సిగ్గుతో 'అలాగేనండీ. తప్పకుండా ....'' అన్నాడు. అన్న ప్రకారం క్రితం రాత్రి తమ ఇంటినుంచి రెండు ఫర్లాంగులు దూరమూ వచ్చి శ్రీహరిరావుకు రాత్రి చాలా ప్రొద్దుపోయేవరకూ—దాదాపు ఒంటిగంట దాటే వరకూ రకరకాల లెక్కలు విపులంగా చేసి చూపించాడు. అతని దగ్గర వింటున్నంతసేపూ శ్రీహరిరావుకు ఏమిటో అర్థమయినట్టే ఉంది. లెక్క లనబడే ఆ విచిత్రం చుట్టూ ఉన్న మాయతెర సూర్యకిరణ స్పర్శతో కరగిపోయే మంచులా విడిపోతున్నట్టే అనిపించింది. పైగా క్రిందటి రాత్రి ఆ కుర్ర

వాడు తన యింటికి వెళ్లిపోతూ శ్రీహరిరావుతో, ''అంత భయం అక్కరలేదు మాష్టారూ. ఈసారి పేపరు తేలికగానే ఉంటుందని నా అభిప్రాయం. నే నిప్పుడు చెప్పిన నమూనా లెక్కలు పరీక్ష పేపర్లో 'దిగటం' ఖాయం.'' అంటూ గొంతు తగ్గించి,రహస్యం చెప్తున్నట్లు ''అలానూ కాకపోతే ఆఖరి అరగంటలో నేను కొంచెం పక్కకు జరిగి చూపిస్తాను. రెండు థీరమ్సూ, రెండు రైడర్సూ, ఒకటో రెండో ఆల్జీబ్రా లెక్కలూ కాపీ చేసెయ్యండి. పాసు మార్కులు పడిపోతాయి'' అన్నాడు కూడా.

శ్రీహరిరావు అప్పుడయితే నవ్వి వచ్చేశాడే కాని, మరునాడు ఉదయం చిటపటలాడుతున్న ఎండలో బస్సుకోసం ఎదురుచూస్తూ నుంచుని ఉండగా ఒకవిధమయిన భయమే కలిగింది. అసలే లెక్కలు. తన పాలిటి పెనుభూతం. పైగా కిందటి రాత్రి బాగా ఆలస్యంగా పడుకున్నందువల్ల ఇంత పొద్దెక్కే వరకు మెలకువ రానేలేదు. మొదటి అరగంట దాటితే పరీక్షకు రానివ్వరు కూడా .... ఈ బస్సు ఎంతకూ రావటంలేదు ......

అతడు అలా నిలబడి రోడ్డు చివరి వరకు చూస్తూనే గడియారాలున్న పెద్ద మనుషులను గమనించి దాదాపు అందరినీ ''టైమెంత అయిందండీ!'' అని అడుగుతూనే ఉన్నాడు. కొంతమంది వినిపించుకోనట్టు ఏ అర్జంటు పనులమీదనో హడావుడిగా వెళ్ళిపోతున్నారు. కొంతమంది సమాధానం చెప్తున్నారు. ఒకాయన శ్రీహరిరావుకు టైమ్ చెప్పి మరేమీ పనిలేదు కాబోలు కూనిరాగం తీస్తూ అక్కడే నించుని ఉన్నాడు.

శ్రీహరిరావు బస్సుకోసం అలా నిలబడి దాదాపు ఇరవై నిముషా లవుతున్నది. అతడు పొద్దున లేచి ముఖం కడుక్కోవటం తప్పించి లోపలికి ఇంతవరకు ఏమీ తీసుకోలేదు. నిన్నా మొన్నా అతని అక్కగారు పొద్దునే కాఫీపెట్టి యిచ్చి పంపించింది. ''ఇవ్వాళ పాలమనిషి రాలే''దని కదూ ఆమె చెప్పింది ? అవును. నిన్న పొద్దున జరిగిన పోట్లాట తరువాత పాలమనిషి జన్మలో ఇంక ఎన్నడూ పాలు తీసుకురాదు. అయినా బావగారి కిదేం పాడుబుద్ధి ! అదేదో కంపెనీలో ఉద్యోగంచేస్తూ నెలకు నూట పాతిక రూపాయలు సంపాయిస్తున్న పెద్దమనిషి, పాల బాకీ మూడు నెలలుగా నిలవ ఉంచేయడం తగునా ? వారు మాత్రం మనవంటి మనుషులు కాదూ ? మనకు రెండు నెలలపాటు జీతాలు ఆపు చేస్తే ఎలా ఉంటుంది ? మన మివ్వవలసినవాళ్ల కివ్వకపోయినా అంతే .... నిన్న పాలమనిషి పోట్లాడి వెళ్లిపోయింది. మళ్లీ డబ్బుకోసం ప్రతిరోజూ వచ్చి పోట్లాట సాగిస్తుంది .... నలుగురిలోనూ నగుబాటు వ్యవహారం. ఈలోపల రోజూ యింట్లోకి పాలుండవు .... కాఫీ ఉండదు .... తాను మొగవాడు కాబట్టి జేబులో చిల్లర డబ్బులు వేసుకొని బజారుకు వెళ్లి ఏ హోటల్లోనో కాసిని కాఫీ త్రాగివస్తాడు. ఇంటో ఆమె గతి ఏమిటి ? పైగా ఇంటో యితర సరుకులు కూడా నిండుకున్నట్టున్నాయి. నిన్న ఆమె ఏదో పట్టిక వ్రాసి యిచ్చింది కాబోలు .... 'నెల మధ్యలో సరుకు లెలా వస్తాయి?' అని విసుక్కుంటున్నాడు బావగారు. ఆమె ఎంతో బాధపడుతున్నట్టు కనిపించింది. ఇన్నిటికి తోడు బావగారికి సెంటర్లో రూములో పేకాట !

శ్రీహరిరావు అడగ్గా ఆటువైపు నడిచిపోతున్న సిల్కులాల్చీ పెద్దమనిషి ఎవరో 'అయిదు నిముషాలు తక్కువ ఎనిమిది' అని చెప్పి పోయాడు. శ్రీహరిరావు మొహాన పట్టిన చెమటను తుడుచుకుని 'ఇవ్వాళ అంతా పరీక్షగానే ఉందే. లేకపోతే బస్సు ఇంతవరకూ రాకపోవడం ఏమిటి ?' అనుకున్నాడు.

దూరాన మిలమిలలాడే ఎండలో తళతళ లాడుతూ రెండో నెంబరు బస్సు కనిపించేసరికి అతడి ప్రాణాలు కుదుటబడ్డాయి. జేబులో భద్రంగా దాచిన చిల్లరడబ్బులు చేతిలోకి తీసుకుని పదిహేను పైసలు ఏరుకుని మిగిలినవి మళ్లీ జేబులో పడేసుకున్నాడు. బస్సు ఆగగానే ఒక్క ఉదుటున, దిగేవారిని దిగనివ్వకుండానే ఎక్కి లోపలికి వెళ్లి కూర్చున్నాడు. పక్కనున్న పెద్దమనిషిని ''టైమ్ 'కరెక్టు'గా ఎంతయింది ?'' అని ఒత్తి అడిగాడు. ఆ మనిషి అంత గట్టిగానూ ఒత్తుతూ 'కరెక్టుగా ఎనిమిదీ అయిదు నిముషాలు' అన్నాడు. తర్వాత రెండు నిముషాలు రెండు యుగాలవలె గడిచాయి.

వచ్చి నిలబడిన బస్సు ఎంతకూ కదలదు. డ్రైవరు కాఫీకి కాబోలు దిగిపోయాడు. కండక్టరు పేవ్‌మెంట్‌మీద నిలబడి ఎవరితోనో రాజకీయాలు చర్చిస్తున్నాడు. ఎక్కడో జరుగుతున్న ఉప ఎన్నిక రెండు ప్రముఖ పార్టీలకు ఎలా ప్రతిష్టను గురించిన సమస్య అయిందో, అక్కడి అధికార పార్టీ అభ్యర్థి ప్రతిపక్షం అభ్యర్థి చేతులలో చిత్తుగా వోడిపోవడం ఎంత ఖాయమో చెబుతున్నా డతడు. ఆ ప్రక్కనున్న వ్యక్తి మాత్రం తక్కువ తిన్నాడా ? ప్రతిపక్ష అభ్యర్థి యింతకుముందు జనరల్ ఎన్నికలలో ఫలానా చోట రెండు లక్షల వోట్ల తేడాతో ఎంత ఘనంగా ఓడిపోయాడో ఆయన తెలియజేశాడు. కండక్టరు ''అయితేనేం ? అప్పటి పరిస్థితులు వేరు. ఇప్పటి పరిస్థితులు వేరు. ఇప్పుడు ప్రతిపక్షం బలపడింది. అధికార పక్షంవారు ప్రజలమీద ఎన్నో పన్నులు వేస్తున్నారు. ఈ పన్నులభారంవల్ల ప్రజలలో అసంతృప్తి బయలుదేరింది. ఆ ప్రతిపక్షంవారు 'మేము పదవికి వస్తే పన్నులు లేకుండానే రాజ్యం చేస్తామని మాట యిచ్చారు' అన్నాడు. ''అవన్నీ ఎన్నికల వాగ్దానాలండీ .... రేపీపాటికి వారూ ప్రజలూ కూడా మరిచిపోతారు. వీళ్లు గెలిచినా మన పని ఇంతే ....'' అంటున్నాడు అవతలి వ్యక్తి.

శ్రీ హరిరావు ఇదంతా వింటూ ముళ్లమీద కూర్చున్నట్టు కూర్చున్నాడు. అతని పక్కనున్న పెద్దమనిషి చేతి గడియారంలో పెద్ద ముల్లు తనకొంప ఏదో మునిగిపోయినట్టుగా గబగబా తిరుగుతున్నది. బస్సేమో కదలకుండా నిశ్చలంగా ఏదీ పట్టని ఒక యోగిలా నుంచుని ఉంది. ఈ కండక్టరు పేవ్‌మెంట్ రాజకీయాలు యిప్పట్లో తేలేట్టు లేవు. డ్రయివరు కాఫీ తాగటం యిప్పట్లో అయ్యేట్లు లేదు.

శ్రీహరిరావు మనసంతా చికాకుగా ఉంది. ఇవాళ లెక్కలు పరీక్ష అని అతడు మొదటి నుంచీ భయపడుతూనే వచ్చాడు. దీనికి తోడు ఈ ఆలస్యం కూడా జరగటం మరీ దారుణంగా ఉంది. ఆ లెక్కల పేపరు ఎలా ఉంటుందో! ఆల్జీబ్రా, జామెట్రీ అంతా తనకు అగమ్యగోచరం. దాని సంగతి ఆలోచించనే అక్కర్లేదు. ఇక పోతే కాలము—పని, కాలము—దూరము, పెట్టుబడులు, నిష్పత్తులు, బారువడ్డీ, చక్రవడ్డీ లెక్కలు .... యీ వడ్డీ లెక్కలు చదువుతూ ఉంటే బాగానే ఉంటాయి .... అర్థమవుతున్నట్టే ఉంటాయి. చెయ్యబోయేసరికి ఎలా మొదలుపెట్టాలో తెలియదు. ఈ వడ్డీ లెక్కలు కనిపెట్టినవాడెవడో ? .... బహుశా అప్పులిచ్చేవాడయి ఉంటాడు. .... మరొకళ్లకు వడ్డీతో ఏంపని ? వడ్డీలకు అప్పులిచ్చి ఎందరో లక్షలు సంపాయించి మేడలూ, మిద్దెలూ కట్టారని తాను విన్నాడు. అవును. అదీ ఒక పెద్ద వ్యాపారమే .... తన ఊరిలో తాను ఉంటున్న యింటికి ఎడమవైపు మూడో యింట్లో ఉండే షావుకారుకు యిదే వ్యాపారం. ఆ ఎదురింటి ఆయనకు వడ్డీకి అప్పులు తీసుకోవడమే పని .... ఆ షావుకారు అంతంత మొత్తాలకు అంతంత వడ్డీలు ఎంత సునాయాసంగా లెక్క గట్టగలడో .... తలుచుకుంటే ఆశ్చర్యం కలుగుతుంది .... అది సరేనయ్యా! ఈ బస్సు ఎంత కాలానికి బయలుదేరును ?

ఇక పోతే మిగిలిన కాలము—దూరము, కాలము—పని, నిష్పత్తులు మొదలైనవి తన కాట్టే పరిచితమైన లెక్కలు కావు. వాటిలో ఏవి టేమిటో మెలికలూ, మడత పేచీలూ ఉంటాయి. అవే తన కొంప తీసేవి .... అవే తన కర్థం కానిది .....

డ్రయివరు కడుపు చల్లగా నూరేళ్లపాటు వర్ధిల్లగలడు .... కిళ్లీ నములుతూ వచ్చి తన సీటులో కూర్చుని బస్సును స్టార్టు చేశాడు. కండక్టరు తన పేవ్‌మెంట్ రాజకీయ మిత్రుణ్ణి వదలలేక వదలలేక వదిలివచ్చి బస్సు ఎక్కి టికెట్, టికెట్' అని అరుస్తున్నాడు.

మరొక నిముషంలో 'రైట్' అని వెనకనుంచి వినిపించడంతోనే డ్రయివరు అప్పుడే కాఫీ త్రాగి కిళ్లీ వేసుకువచ్చి హుషారులో రిక్షాలూ, బళ్ళూ, మనుషులూ, ముసలమ్మలూ, ముక్కుపచ్చలారని పిల్లలూ, సైకిళ్ళూ, అన్నిటినీ అవలీలగా, హేలగా తప్పుకుంటూ ప్రయాణం సాగించాడు.

శ్రీహరిరావు మళ్లీ టైమ్ అడిగి తెలుసుకుని ఆదుర్దాగా కూర్చున్నాడు.

తర్వాత బస్సు కాలేజీ భవనం సమీపించి ఆగగానే అందులోనుంచి ఒక్క దూకు దూకి కట్టుకున్న పంచె కాళ్లకడ్డంవచ్చి పడబోయి నిలద్రొక్కుకుని, ఉరుకులు, పరుగులుగా కాలేజీ వరాండాలో పరుగెత్తి రూమ్ నెంబరు పందొమ్మిది ముందు ఆయాసంతో వగర్చుతూ నిలబడ్డాడు. పరుగెత్తిన కుదుపువల్ల జేబులోని పెన్ను సిరా కక్కి కోటు అంతా ఖరాబు చేసింది.

ఆ రూములో వాచర్లు యిద్దరున్నారు. అందులో ఒకాయన మరీ కుర్రవాడుగా కనిపిస్తాడు. ఎర్రగా, పొట్టిగా టొమాటో పండులా ఉంటాడు. కేవలం పాతిక యేళ్లు కూడా ఉండవనిపిస్తుం దతన్ని చూస్తే. ఎప్పుడూ నవ్వుతూ కలకలలాడుతూ ఉంటాడు. ఖరీదైన సూటుతో నిగనిగలాడేట్టు పాలిష్ చెయ్యబడిన నల్లని బూట్లతో చాలా మర్యాదస్తుడివలె ఉంటాడు. అంత చిన్న వయసులో ఎప్పుడు ఎం. ఏ. పాసై, ఎప్పుడు ఉద్యోగంలో చేరాడో తలుచుకుంటేనే శ్రీహరిరావుకు ఆశ్చర్యంగా ఉంటుంది. రెండవ ఆయన మధ్య వయస్కుడు. గంభీరమైన మనిషి. కదలనైనా కదలకుండానే చూపులతో ఎదుటివారిని శాసించేటంతటి ఠీవీ, దర్పమూ ఉన్నాయి ఆయనలో .....

మొదటి వాచరు ఆలస్యంగా వచ్చిన శ్రీహరిరావును చూసి తలవూపి 'లోపలికి రమ్మని' సైగచేసి గడియారం చూసుకుని ఒక పరీక్ష పేపరూ, ఆన్సర్ బుక్కూ యిచ్చి వెనక్కు తిరుగుతూ ఉండగా 'గణగణ' మని మొదటి అరగంట అయినట్టు తెలుపుతూ 'ఎలక్ట్రిక్ బెల్' మ్రోగింది.

శ్రీహరిరావు అసలే మాసివున్న చేతి రుమాలుతో మొహానికి పట్టిన చెమటను తుడుచుకుని, తర్వాత లెక్కల పేపరును కొద్దిగా ఒణుకుతున్న వ్రేళ్లతో పట్టుకుని, గుండెలు దడదడ లాడుతూ ఉండగా పైనుంచి క్రిందిదాకా చూశాడు.

* * *

ఆ హాల్లో సరిగ్గా యిరవై అయిదు మంది అభ్యర్థులు రకరకాల వయసులవారూ, రకరకాల శరీరచ్ఛాయల వారూ, సన్నటివారూ, లావుపాటివారూ, పొట్టివారూ, పొడుగువారూ నిశ్శబ్దంగా పరీక్ష వ్రాస్తునారు. అందులో నలుగురు ఆడపిల్లలు. రెండో బల్లమీద కుడి చివర కూర్చుని ఉన్నదొక అమ్మాయి. శ్రీహరిరావు రెండు రోజుల నుండి చూస్తూనే ఉన్నాడు. ఆ అమ్మాయి అందరి వెనకా తల వంచుకొని నేలను చూస్తూ నడుస్తూ వచ్చి బల్లమీద తన స్థానంలో కూర్చుంటుంది. తల వంచుకొని ఉండి పేపర్లు అందుకుంటుంది. తల వంచుకునే మూడు గంటలు సేపు ఏదో గిలుకుతూ కూర్చుంటుంది. ఒక్కసారి కూడా తల ఎత్తి చూచిన పాపాన పోలేదు. మరొక అమ్మాయి చివరి బెంచీలో గోడ పక్కన కూర్చుని ఉంది. ఆ పిల్ల ఎందుకో అంతసేపు ఉండి ఉండీ జేబు రుమాలుతో మొహం తుడుచుకుంటూనే ఉంది. అటువంటప్పుడు అసలే ఎర్రనైన ఆమె ముఖం మరీ ఎర్రబడి చిత్రంగా ఉంటుంది. మిగిలిన ఇద్దరూ వెనకవైపు ఒకే బల్లమీద కూర్చుని ఎక్కువకాలం ఒకరికి తెలియకుండా మరొకరు పరస్పరం దొంగతనంగా పరిశీలన చేసుకుంటూ ఉంటారు. వారిలో ఒకమ్మాయి బాగా ధనవంతుల పిల్ల కాబోలు, రోజు కొకరకం ఉల్లిపొరవంటి ఖరీదైన చీరలు జాకెట్లతో, మెడలో ధగధగలాడే నెక్లెస్‌తో, ఒక చేతికి ఖరీదైన వాచీ, మరొకచేతికి బంగారపు గాజులతో

పరీక్షకు వస్తూ ఉంటుంది. ఆ పక్కనున్న అమ్మాయి చాలా అందమైనది. వయసులో పక్కనున్న ఆమెకంటే చిన్నది. పదహారు వన్నెల పసిడిఛాయలో ఆమె శరీరం మిలమిల లాడుతూ ఉంటుంది. నున్నగా చిన్న చిన్న అద్దాలవలె కాంతులీనుతున్న ఆమె చెంపలకు చేరడేసి చక్రాలవంటి కళ్ళున్నాయి. పిరుదులను దాటి అందంగా కదిలే ఆమె జడ పెద్ద నల్లత్రాచును పోలి ఉంది. అయితే ఆమె వంటిమీద చెప్పుకోదగిన ఆభరణాలేమీ లేవు. ధరించిన దుస్తులు కూడ సామాన్యంగానే ఉన్నాయి.

ఆ హాల్లో మిగిలినవా రందరూ రకరకాలవా రున్నారు. మొదటి వరుసలో రెండో బెంచీలో కుడివైపు కూర్చుని ఉన్న పద్దెనిమిదేళ్ళ ఎర్రని కుర్రవాడూ, రెండో వరుసలో మూడవ బెంచీలో ఎడమవైపు కూర్చున్న నలభయ్యేళ్ళ కళ్ళజోడు పెద్దమనిషికి అల్లుడవుతాడు. పెళ్ళి కొద్ది నెలల క్రితమే జరిగిందట. మామా అల్లుళ్ళిద్దరూ మెట్రిక్‌కు కట్టి ఒక్కసారే పరీక్ష వ్రాస్తున్నారు. శ్రీహరిరావు నిన్నటి రోజున తెలుగు పరీక్ష వ్రాసిన తరువాత, తనలో "ఇంత ఘనమైన మామగారు, పరీక్ష తప్పి, పసివాడైన ఆ అల్లుడు పాసయితే వాళ్ళ ఇంట్లో ఆనా డెలా ఉంటుందో! బహుశః 'పుత్రోత్సాహము' అన్నట్లు మామగారు సంతోషిస్తారేమో" అనుకున్నాడు. అటువంటి పర్యవసానం తల్చుకొంటేనే అతనికి చిత్రంగా తోచింది.

ఇక తను కూర్చునిఉన్న బెంచీలో తన పక్క కూర్చుని ఉన్న పదిహేడేళ్ళ అబ్బాయి ఎవరో జమీందారుల బిడ్డడేమో! ప్రతిరోజూ పరీక్షవేళకు తళతళలాడే కారులో .... శ్రీహరిరావు "అందులో ఒక్కసారి ఎక్కితే ఎంత బావుంటుందో" అనుకున్నాడు కూడా.... ఎక్కించి తీసుకువచ్చి రూము ముందు దింపుతారు. అందులోనుంచి డ్రైవరు దిగి సవినయంగా తలుపుతీసి నిలబడి ఉండగా, అతగాడు అందమైన టెరిలిన్ షర్ట్‌తో, నల్లని ట్వీడ్ పాంటుతో, మెడలో ఒంటిపేట బంగారు గొలుసుతో, మెత్తని ఎంబాసిడర్ బూట్లతో, చుట్టూ కమ్మగా వ్యాపించే సువాసనతో కారు దిగి, 'ఎక్కడ అలుపు వస్తుందో' అన్నట్లు నెమ్మదిగా నడచివచ్చి, 'వెధవ కొయ్య బల్లమీద కూర్చుని ఎలా పరీక్ష వ్రాయటం' అన్నట్లు విసుగ్గా ముఖంపెట్టి ఖరీదైన జేబు రుమాలుతో బల్ల తుడుచుకొని కూర్చుంటాడు. తరువాత జేబులోనుంచి ఖరీదైన బంగారు కలం తీసి ఒక గంటసేపు ఎంతో వోపికగా కూర్చుని నెమ్మదిగా ఏదో వ్రాస్తాడు. ఆ తర్వాత ఇక అక్కడ కూర్చోలేక పేపరు వాచరుకు ఇచ్చేసి, పెన్ను జేబులో పెట్టుకొని, అంతమాత్రానికే నలిగిన మల్లెపూవులా బయటికివెళ్ళి కారులో కూర్చుని ఇంటికి వెళ్ళిపోతాడు.

మొదటి వరుసలో మరొక కుర్రవాడు ఎక్కడో హొటల్లో సర్వరుగా పనిచేస్తున్నాడట. అక్కడికి తరచూ కాఫీకోసం వచ్చే ఒక స్కూలు మేష్టరుతో పరిచయం చేసుకొని వినయపూర్వకంగా ప్రవర్తించి, ఆయన సహృదయంతో తోడుపడగా కృషిచేసి చదివి మెట్రిక్ పరీక్ష వ్రాస్తున్నాడు. ఇది పాసయిన తర్వాత అలాగే ఇతర పరీక్షలకూ కూడా ప్రయివేటుగానే వెళ్ళి ఒకనాటికి వజ్రసంకల్పంతో, దీక్షాబలంతో ఎం. ఏ. పాసయినా ఎవరూ ఆశ్చర్యపడ నక్కరలేదు. అంతా మనలో, మన సంకల్పబలంలో ఉంది. అటువంటివాడు ఈ పరీక్షలనే కాదు, జీవితపు పరీక్షలను కూడా ధైర్యంతో ఎదుర్కొని ఉత్తీర్ణుడు కాగలడు. ఆ లక్షణాలు లేని తన వంటివాడి జీవితం, "ఎక్కడున్నావే గొంగళీ" అంటే, "వేసిన చోటే ఉన్నా" నన్నట్టే ఉంటుంది. తన సాధనలూ, విజయాలు కూడా అల్పంగానే ఉంటాయి. తనబోటివాడికి పెళ్ళాం పిల్లలను పోషించుకోవడమే పెద్ద ఘనకార్యం.

శ్రీహరిరావుకు ముందు రెండు వరుసల తరువాత బల్లమీద కూర్చుని ఉన్నవాళ్ళిద్దరూ చిత్రమైన ప్రకృతులవారు. ఎడమవైపున కూర్చున్న అబ్బాయి ఎక్కడ ఒక్క క్షణకాలం వృథా పోతుందో అన్నట్లు త్వర త్వరగ వ్రాసేస్తూ ఉంటాడు. కూర్చునే ముందే చేతి గడియారం బల్లమీద తన ముందు పెట్టుకొని ప్రతి క్షణమూ ఎంతో విలువైనదిగా భావించినట్లు పక్కకు తిరిగి కూడా చూడకుండా వ్రాసుకు పోయేవాడు. తీరా మూడు గంటలూ అయిపోయి అందరూ లేచి బయటికి వెళ్ళినప్పటికీ, వాచర్లు నిర్బంధించేస్తే తప్ప పేపరు ముగించి ఇచ్చేవాడు కాడు. చివరకు "మూడు గంటలూ అప్పుడే అయిపోయిందా" అన్నట్లు బాధగా కదిలి ఇవతలికి వచ్చేవాడు. అతనికి ఆరు గంటల వ్యవధి ఇచ్చినా చాలదేమో అనిపించేది. అతని ప్రక్కనున్న కుర్రవాడు అతి సోమరిగా ఉంటాడు. ఎన్నడూ దువ్వెన పేరైనా విననట్లు అతని జుట్టు దురుసుగా నుదుటిమీద పడుతూ ఉంటుంది. ఉండి ఉండి ఆవులిస్తూ ఉంటాడు. పేపరు తీసుకోగానే దాన్ని చేతులలో ఉంచుకొని మొదటి అరగంట అంతా ఊరికే అందులోకి చూస్తూ కూర్చుంటాడు. రెండో అరగంటలో నెమ్మదిగా జేబులో నుంచి కలం పైకి తీస్తాడు. ఆవులిస్తూ పెన్ను మూతను నెమ్మదిగా వెనకభాగానికి ఉంచి ఒక్క నిముషం దానికేసి చూస్తాడు. ఆ తర్వాత ఆన్సర్ బుక్కు మీద నెంబరు వెయ్యదలచినచోట తన నెంబరు చెక్కుతాడు. దానిచుట్టూ రకరకాల లతలూ, పువ్వులూ చిత్రిస్తాడు. ఇదంతా అయ్యేసరికి రెండో అరగంట అయిపోతుంది. గణగణమని ఆ గంట మ్రోగగానే కలం బల్లమీద ఉంచి బాగ అలసిపోయిన వాడివలె వ్రేళ్ళు విరుచుకొని మళ్ళీ ఆవులిస్తాడు. తరువాత అరగంటలో ఒక ప్రశ్న గుర్తుపెట్టి ఆన్సర్ పేపర్లో కొంచెం వ్రాస్తాడు. తర్వాత మరొక ప్రశ్నకు అలాగే జవాబు వ్రాస్తాడు. మధ్య మధ్యలో నిముషమో, అర నిముషమో విశ్రాంతిగా కూర్చుంటాడు. ఆతర్వాత మూడో అరగంట కాగానే 'అబ్బో! చాలా వ్రాశానే!" అనుకొని గబగబ పెన్ను జేబులో పెట్టుకొని పేపరు వాచరుకు ఇచ్చేసి వెళ్ళిపోతాడు. అతని ముందు బల్లమీద కూర్చున్నవాడివి చాల వాడి చూపులు. దొంగ కోళ్ళు పట్టే వాడిలా అస్తమానం పక్క చూపులు చూస్తూనే ఉంటాడు.

జేబు రుమాలు మడతపెట్టి బల్లమీద ఉంచి, ఉండి ఉండి దాని మడతలు విప్పబోతూ, మళ్ళీ మడవేస్తూ ఉంటాడు. వాచర్లు తనవైపు చూచినప్పుడు కాలు దురద పుడితే గోక్కుంటున్నట్టు గంభీరంగా అభినయం చేస్తాడు. అతని వాలకం ఒక్కొక్క అరగంట అయిపోయే కొద్దీ మరీ చిత్రంగా మారుతూ ఉంటుంది. చివరి అరగంటలో గద్దలాగ దొంగ చూపులు చూస్తూ ముళ్లమీద కూర్చున్నవాడివలె ఆదుర్దాగా ఉంటాడు. పేపరు యివ్వవలసి వచ్చినప్పుడు తెచ్చుకున్న కాపీ కాగితాలు చూచేందుకు కూడా వీల్లేక పోయిందనే విచారం స్పష్టంగా కనిపించేది. ఉసూరు మంటూ దీనంగా పేపరు యిచ్చి యివతలికి వచ్చేవాడు.

మరొక పధ్నాలుగేళ్ల కుర్రవాడు నిన్నటి తెలుగు పరీక్ష రోజున బల్లమీదుగా వంగి ఎదుటివాణ్ణి రహస్యంగా ఛందస్సును గురించి అడుగుతూ ఉండగా పట్టుబడి చివాట్లు తిన్నాడు. వాచరు అతనికి గట్టిగా హెచ్చరిక చేశాడు. "ఈసారి మళ్లీ నిన్ను యిలా చేస్తూ ఉండగా చూశానంటే ఊరుకోను జాగ్రత్త" అని.

శ్రీహరిరావు ముందు బెంచీలో ఎడంపక్క కూర్చున్న ఒక వ్యక్తి తెల్ల కాగితాల పాలిటి రాక్షసుడివలె ఉన్నాడు. అతడు ఐదు నిముషాల కొకసారి లేచి నిలబడి, 'పేపరు సార్ !' అంటూ ఉంటాడు. ఒక్కొక్క పేజీకి పదిహేను, యిరవై పంక్తులకన్న ఎక్కువ వ్రాయడు. తాటికాయలంత అక్షరాలు వ్రాస్తాడు. చివరలో పేపరు దారంతో కట్టి యిస్తూంటే ఆ కాగితాల బొత్తి చూచి మిగిలినవారిలో కొందరు ఆశ్చర్యంతో గుండెలమీద చేతులు వేసుకోవడం కూడా జరిగింది.

శ్రీహరిరావుకు వెనుకగా కూర్చుని ఉన్న అబ్బాయికి ప్రశ్న పత్రంలో అన్నీ అనుమానాలే. నిముషాని కొకసారి లేచి నుంచుని వాచరుని ఏదో ఒకటి అడుగుతూనే ఉంటాడు. అతడు అనుమానాల పుట్ట.

శ్రీహరిరావు ముందు బల్లమీద కూర్చున్నవాడు రవి. అతడు చాల తెలివైనవాడనటంలో ఏమీ సందేహంలేదు. అతడు క్రితం రాత్రి శ్రీహరిరావుకు రకరకాల లెక్కలు చెప్పటంలోనే ఆ విషయం తేలిపోయింది. అతడు శ్రద్ధగా, నెమ్మదిగా, తొట్రుపడకుండా అన్ని పేపర్లు చక్కగా వ్రాస్తూనే ఉన్నాడు.

వాచర్లు నిశ్శబ్దంగా కాసేపు అటూ యిటూ తిరుగుతూ, కాసేపు కుర్చునీ ఉంటారు. గోడనున్న గాజు వెంటిలేటర్లలో నుంచి సూర్యకిరణాలు ఆ బల్లల మధ్య ఎక్కడో పడుతూ ఉంటాయి. ఆ హాలుకు ఒక ప్రక్కన పూలచెట్లేవో ఉన్నాయి. అక్కడికి అప్పుడప్పుడు ఏదో ఒక రంగు రంగుల పిట్ట ఎగిరివచ్చి వాగివాగి మళ్ళీ ఎగిరి పోతూ ఉంటుంది. హాల్లో పరీక్ష వ్రాస్తున్నవారి పేపర్ల రెపరెపలూ, కలాల బరబరలూ, వాచర్ల మెత్తని బూట్ల చప్పుడూ అంతా నీరవంగా ఉంటుంది.

## 2

రెండవ అరగంట అయినట్టు 'గణగణ' మని బెల్ మ్రోగింది.

శ్రీహరిరావు కలం క్రింద వుంచి జేబు రుమాలుతో మొహం తుడుచుకున్నాడు. అతని మనసంతా చీకాకుగా ఉంది. అతడు హతాశుడై ఉన్నాడు. లెక్కల పేపరు అతని ముందు, బల్లమీద అతన్ని సవాలుచేస్తూ, అవహేళనచేస్తూ రెపరెప లాడుతున్నది. మొదటిసారి ఆ పేపరు చూసినప్పుడే శ్రీహరిరావుకు అనుమానం కలిగింది అందులో రెండు, మూడు, నాలుగు పేజీలలో ఉన్న ఆల్జీబ్రా, జామెట్రీ, ఏవో ప్రయోగాత్మకమైన లెక్కలూ అతని కసలు తెలియవు. వాటిని గురించి అతడు మొదటినుంచి ఆశలు పెట్టుకోలేదు. ఇక మొదటి పేజీలో ఉన్న సామాన్య గణితం అయినా లొంగకపోతుందా అని ఆశపడ్డాడు. ఆ వడ్డీ లెక్కలూ కాలము—పని, కాలము — దూరము, లెక్కలూ అతనికి క్రిందటి రాత్రి రవి చెప్పినప్పుడు అర్థమైనట్టే అనిపించింది. ఇప్పుడు పేపర్లో లెక్కలు అదే ధోరణిలో ఉండటం మొదట్లో అతనికి ధైర్యమిచ్చినప్పటికీ, సాధించబోయే సరికి అవి అతనికి తేలికగా లొంగలేదు. ప్రతి లెక్కలోనూ సూక్ష్మమైన, చిత్రమైన మెలిక ఒకటి ఉంది, శ్రీహరిరావును చికాకు పరిచేది. అలా అతడు ప్రయత్నంచేసిన ప్రతి లెక్క అసంపూర్ణంగా ఆగిపోయింది. ఒకచోట ఆగిపోతే తర్వాత ఎలా చెయ్యాలో తెలిసేది కాదు. అంతటితో ఆ లెక్కకు స్వస్తిచెప్పి మరొకటి ఎత్తుకునేవాడు. అదీ అలావే చిక్కులుపెట్టి అసంపూర్తిగా ఆగిపోయేది. తర్వాత అతడు పూర్తిగా చేసిన లెక్క ఒకటి ఉంది కాని, అందులో ఎక్కడో తప్పు జరిగింది. తాను, చేయవలసిన విధంగా కాక మరొక విధంగా చేశాడేమో, లెక్కలోని వివరాలనుబట్టి చూస్తే 'ఆన్సరు' తప్పని స్పష్టంగా తెలిసిపోతున్నది. తర్వాత కొంతసేపు ఆల్జీబ్రా జోలికి పోయి కాయితాలు ఖరాబు చేశాడు. ఆ లెక్కలు ఏమిటో అంతూ పంతూ లేకుండా పేజీలకు పేజీలు అర్థంలేకుండా పెరిగిపోయాయి. అరగంట తర్వాత అతని ముందు ఉన్న ఆన్సర్ పేపర్లో మిగిలినది అర్థం పర్థంలేని అసంపూర్ణమైన వ్రాత .... అది తన జీవితం లాగే ఉంది .......

శ్రీహరిరావు కళ్లు గట్టిగా మూసుకున్నాడు. అతనికిప్పుడు ఒక విషయం నిశ్చయంగా లేశమాత్రమైనా సందేహం లేకుండా తేలిపోయింది. తాను లెక్కల పేపరు ఏమాత్రము ఆన్సర్ చెయ్యలేక పోయాడు.... తాను ఎంత ఆలోచించవలసి ఉయిందో ప్రతి లెక్కను గురించీ అంత గానూ ఆలోచించాడు. అయినా ఏం ప్రయోజనం ? ఆ లెక్కల పద్ధతీ మూలసూత్రాలే తెలియనప్పుడు వాటిని తాను ఎలా సాధించగలడు ?

తాను ప్రయత్నంలో ఏమేమి చెయ్యలేదు. ఎనిమిది పేజీల అన్సరు పుస్తకంలోనూ కొన్ని పేజీలు పూర్తిగా

విండిపోయి తన ప్రయత్నానికి నిదర్శనంగా బల్లమీద ఉన్నాయి. ఇక తాను చేయవలసిందీ, చేయగలిగిందీ కూడా ఏమీ లేదు .... ఇక యిప్పుడే బయటికి వెళ్ళిపోయినా పోవచ్చు. అయినా వెళ్ళి చేసేది మాత్రం ఏంవుంది గనుక ? ఒక లెక్క కూడా సరిగ్గా చెయ్యకుండా పేపరు యిస్తున్నాడు కాబట్టి తాను పరీక్ష తప్పటం ఖాయం. ఆ విషయంలో అనుమానం ఏమీ లేదు. ఇక ఇక్కడ అక్కగారి యింట్లో ఆ యిబ్బందులు చూస్తూ సహిస్తూ ఉండటం కూడా అనవసరం. వారికీ అది అట్టే సంతోషకరమైన విషయం కాదు. 'రాకరాక తమ్ముడు వచ్చాడే అని ఆమె సంతోషించినా యీ దారుణపు రోజులలో వారి యింటిమీద పడివుండటం తనకూ న్యాయంకాదు. 'అందునా ఎలాగూ లాభం ఏమీ లేదు కాబట్టి, ఒట్టి పేపరు యిచ్చివేస్తున్నాం, కాబట్టి సాయంకాలమే బయల్దేరి వెళ్ళిపోవడం క్షేమం. అక్కడ సెలవు మాత్రం వ్యర్థం చేసుకోవటం ఎందుకు ?' అనిపించిందతనికి.

అతడలా సోమరిగా కూర్చుని ఆ హాల్లో ఉన్న యిరవై అయిదు మందినీ తరగతులవారీగా విభజించాడు .... ఆడపిల్లలు నలుగురు .... మొగవారు యిరవై ఒక్కమంది.... అందులో పొట్టి లాగూలవాళ్ళు ఆరుగు రున్నారు. పంచెల వాళ్ళు నలుగు రున్నారు తనతో కలుపుకుని .... మిగిలినవారందరూ ప్యాంట్లు ధరించినవారే .... కళ్ళజోళ్ళవాళ్ళు ఎనిమిదిమంది ఉన్నారు. అయినా ఆమూల కూర్చునివున్న పన్నెండేళ్ల కుర్రవాడికీ, అప్పుడే కళ్ల జబ్బేమిటో పాపం ! ఆ ఈడుకే దళసరి కళ్లద్దాలు పెట్టుకుని ఉన్నాడు .... పెద్దవాడైన తర్వాత 'బైనాక్యులర్' పెట్టుకుంటే తప్ప అతనికి ప్రపంచం కనిపించదేమో ? .... శరీరచ్ఛాయలు చూస్తే తన ప్రక్కనే కూర్చునిఉన్న జమీందారుల అబ్బాయే అందరికంటె పచ్చనివాడు. ఇక నల్లనివాడు ఎడమవైపు వరుసలో చివర మూడో బెంచీలో ఉన్నాతడు. ఎంత నలుపూ అంటే .... కాకిమెడ, బొగ్గుముక్క, కరక్కాయ సిరా, అమావాస్య చీకటి .... వంటి ఉపమానాలు ఉపయోగిస్తే తప్ప ఆ నలుపు ఎంతటిదో అర్థంకాదు .... సరే .... ఎవరి అదృష్టం వారిది.... దాని కెవరేం చేయగలరు ? బ్రహ్మదేవుడు బొమ్మనుచేసి' ఏరంగు చేతికి దొరికితే ఆ రంగు పూసి 'పో భూలోకంలోకి' అని విసిరివేస్తాడు కాబోలు !

శ్రీహరిరావు అలా అందర్నీ తరగతులవారీగా విభజించటం అయిన తర్వాత జమీందార్ల అబ్బాయి చేతి 'ఏడు రాళ్లు' ఉంగరంమీద పడిన సూర్యకిరణాలవల్ల గోడమీద పడి చిత్రంగా కదులుతున్న రంగులకాంతి సముహం వంక కొంత సేపు కన్నార్పకుండా చూశాడు. ఆతర్వాత అతని కేమీ తోచలేదు. నిద్ర చాలనందువల్ల కాబోలు ఆవులింత వచ్చింది. ఆవులించిన తర్వాత 'ఆవులిస్తే ప్రేగులు లెక్కపెట్టడమంటే ఏమిటో ?' అని కాసేపు ఆలోచించాడు. ఆ ఆలోచన తెగక తర్వాత కొద్దిసేపు జేబు రుమాలుతో ఎలుకపిల్లను తయారుచెయ్యాలని ప్రయత్నించాడు. అది కుదరలేదు కాని, లెక్కల పేపరుతో మర పడవ మాత్రం చక్కగా కుదిరింది.

ఆ తర్వాత అతడు నిర్నిమేషంగా పైకప్పువంక చూస్తూ ఉండిపోయాడు. క్రమంగా అతనికి చాలా మనస్తాపం కలిగింది. తాను లెక్కల పేపర్లో ఏమీ చెయ్యలేకపోయాడు. ఏమీ చెయ్యలేకపోయాడు. చెయ్యలేకపోయాడు .... అదేమన్నమాట ? తాను తన ముప్ఫయి ఆరేళ్ల జీవితంలోనూ ఏం సాధించ గలిగాడు కాబట్టి యీ చిన్న విషయానికి బాధపడాలి ? మొదటినుంచీ తన కెదురైనవన్నీ అపజయాలే .... తాను ఎక్కడా ఏ సందర్భంలోనూ గెలవలేక పోయాడు..... జీవితం ఒక పరుగుపందెం అనుకుంటే ప్రపంచంలో అందరికంటె వెనక ఆయాసంతో రొప్పుతూ పరుగెత్తుతున్నవాడు తాను .... పరుగు పందెంలో అందరికన్నా చివరకు వచ్చినవాడికి ఏం మిగులుతుంది ? అందరి చూపులూ వరుసక్రమంలో ముందుగా పరుగెత్తుతున్న ఏ యిద్దరి ముగ్గురిమీదనో ఉంటాయి .... అందరూ వారికే హుషారు యిస్తూ ఉంటారు. వారికి గెలిచినందుకు బహుమతులుగా వెండి కప్పులూ యిస్తారు. తనకేం మిగులుతుంది ? తనకీ జీవితంలో మిగిలిన దేమిటో స్పష్టంగా తెలుస్తూనే ఉంది. ఎదుగు బొదుగూ లేని డెబ్బయి రూపాయల ఉద్యోగమూ, ముసలి తల్లీ, నలుగురు పిల్లలూ (అందులో ముగ్గురు ఆడపిల్లలూ!) తన నర్థం చేసుకోలేని భార్యా, యిదీ తనకు మిగిలినవి. తాను యవ్వనంలో కన్న బంగారు కలలు కల్లలై తన ఆదర్శాలు వమ్మై, తన అభిరుచులు బూడిదపాలై, తన జీవితమే యిలా మొండిదయి పోయింది.

శ్రీహరిరావు తండ్రిపేరు విశ్వనాథశాస్త్రి. ఆయన మొదటి భార్య కాపురానికి వచ్చిన కొద్ది నెలలకే ఏదో జబ్బు చేసి చనిపోయింది. ఆమెను ఆ కొద్ది సాహచర్యంలోనే ప్రాణాధికంగా ప్రేమించిన కారణంగా ఆయన మళ్లీ ఏడాదికి కాని మామూలు మనిషి కాలేక పోయాడు. ఆయనకు ఒక విధవ అక్కగారు తప్ప ఇతరత్రా 'నా' అన్నవాళ్లెవరూ లేరు. ఆమె తమ్ముడి పంచనే పడిఉండి వేళ కేదో యింత వండిపెడుతూ ఉండేది. ఆయనకు అంత విచారంలోనూ మనశ్శాంతి ప్రసాదించినది వీణ ఒక్కటే. ఆ తాలూకా మొత్తంమీద వ్రేళ్లమీద లెక్కించదగిన అతి కొద్దిమంది సంగీత విద్వాంసులలో ఆయన ఒకడు .... ఆయనను ఎవరెవరో ఆహ్వానించి తీసుకుపోయి కచేరీలు చేయిస్తూ, ప్రతిఫలంగా ఏదో కొంత ముట్టజెపుతూ ఉండేవారు. ఆయన చిన్నతనంనుంచీ అంతగా చదువుకున్నవాడు కాదు. సంగీతం మాత్రం శాస్త్రీయంగా మంచి విద్వాంసుల దగ్గర నేర్చుకుని నిష్ణాతుడై రోజూ కొన్ని యిళ్లలో ఆడపిల్లలకు వాడుకగా వీణ నేర్పుతూ ఎవరయినా పిలిచినప్పుడు కచేరీలు చేస్తుండేవాడు. భార్య పోయిన తర్వాత ఆయన నెలల తరబడి పాఠాలు చెప్పడం మానేసి యింటిపట్టునే ఉండిపోయాడు. అలా ఎన్నా

గడవలేదు. ఆయన క్రమంగా యింటి బాధ్యతలు పట్టించుకోక తప్పలేదు. క్రమక్రమంగా నలుగురిలో పడి మళ్లీ పొలాలు ఏర్పరచుకుని ఆయన దారిలో పడ్డాడు. దానితో ఆయన అక్కగారికి మంచి అవకాశం దొరికింది. 'మళ్లీ పెళ్లి చేసుకుని ఒక యింటివాడవు కమ్మనీ', 'మన వంశం నిర్వంశం కావడం నీకిష్టమా' అనీ ఒకటే పోరు పెడుతూ ఉండేది. ఆయన కూడా ఆలోచించాడు. ఆమె చెబుతున్నది న్యాయమే ననిపించింది. ఆయన మౌనం అర్ధాంగీకారంగా ఆయన అక్కగారే వారితో వీరితో సంప్రదించి, పేదవారే అయినప్పటికీ మంచి సంప్రదాయం కల కుటుంబంతో మళ్లీ సంబంధం కుదిరేట్టు చేసింది .... తర్వాత రెండు సంవత్సరాలకు వారికి ఒక ఆడపిల్ల కలిగింది ..... మళ్లీ రెండు సంవత్సరాలకు శ్రీహరిరావు కడుపున పడ్డాడు. అతడు పుట్టినప్పటి నుంచీ వారి స్థితిగతులు మెరుగయినాయి. ఆయనకు పేరు ప్రఖ్యాతులూ, రాబడీ కూడా మునుపటికంటె పెరిగి కాలం సుఖంగానే జరిగిపోయింది. వెనక వేసేందుకు ఏమి మిగలక పోయినప్పటికీ 'లేదు' నే మాట లేకుండా రోజులు గడిచి పోయేవి.

ఆయన చివరి రోజులలో దగ్గుతో, ఆయాసంతో తీసుకుని తీసుకుని తనువు చాలించేసరికి శ్రీహరిరావు చాలా చిన్నవాడు. ఎనిమిదవ తరగతి చదువుతూ లోకమంటే ఏమిటో, బాధ్యతలంటే ఏమిటో తెలియక హుషారుగా తిరుగుతూ ఉండేవాడు. అతడు చదువుతున్న పట్నానికి వాళ్లు ఉంటున్న వూరు నాలుగు మైళ్ల దూరంలో ఉంది. శ్రీహరిరావు పొద్దున్నే లేచి చద్ది అన్నం తిని, ఏదైనా హోంవర్కు ఉంటే పూర్తిచేసుకుని క్యారియర్ తీసుకుని, పుస్తకాల సంచీ భుజాన తగిలించుకుని బయల్దేరేవాడు. ఒకరిద్దరు పిల్లలను కలుపుకొని పొలిమేరదాటి రోడ్డుమీదికి వచ్చేసరికి అక్కడ జట్టు జట్టు అంతా సిద్ధంగా ఉండేవారు. వాళ్లలో ఎక్కువ భాగం క్రింది వూళ్ల నించీ నడిచి వచ్చేవారు. మొత్తం పదిమందీ గోలచేస్తూ, ఒకరి నొకరు తరుముకుంటూ, పరుగులెత్తుతూ, అలసిపోయినప్పుడు నెమ్మదిగా నడుస్తూ, మరీ ఆయాసం వచ్చినప్పుడు ఏ చెట్టు క్రిందనో మజిలీలు వేస్తూ ప్రయాణము చేసేవారు. అలా మెల్లగా మొదటి గంట అవుతుండే వేళకు స్కూలుకు చేరుకుని ఎవరి క్లాసులకు వాళ్లు వెళ్లేవారు. మళ్లీ సాయంకాలం యింటిముఖం పట్టి పొద్దు గూకుతూ ఉండగా యింటికి చేరుకునేవారు.

శ్రీహరిరావుకు తన బాల్యము, చదువూ, తలపుకు వచ్చేసరికి నవ్వు వచ్చింది. దిగులూ కలిగింది. 'తాము ఎండలో, వానలో అలా భుజాలమీద బండెడు పుస్తకాలూ, చేతుల్లో క్యారియర్లూ మోసుకుంటూ శ్రద్ధగా అన్ని మైళ్లు నడిచి వెళ్లి చదువుకున్నందుకు ఏం దక్కింది ?' అనిపిస్తూ ఉంటుంది అప్పుడప్పుడు. ఆ స్నేహితు లందరూ అప్పుడప్పుడు గుర్తుకు వస్తూ ఉంటారు. తన ఊరి ఉమాపతి, (ఎర్రగా బక్కపల్చగా ఉండేవాడు) విశ్వనాథమూ, రంగడూ (వీడు ఎప్పుడూ పుస్తకాలు పోగొట్టుకుంటూ యింట్లో తన్నులుతింటూ ఉండేవాడు). సత్తి శంకరయ్యా (వీడికి కొప్పూ, చెవులకూ ముక్కులకూ పోగులూ ఉండేవి), జిడ్డు సూర్యమూ (వీడు మొండి వాదనలు చేసేవాడు. అందుకనే 'జిడ్డు' అనే బిరుదు) చిచ్చుబుడ్డి. (వీడి అసలు పేరు యిప్పుడు గుర్తులేదు. మరీ పొట్టిగా లావుగా ఉండేవాడు. అందుకని వాడి పేరు చిచ్చుబుడ్డి) .... వీళ్లందరూ ఏమైనారు ? ఎక్కడున్నారు ? ఎలా ఉన్నారు ?

శ్రీహరిరావు తండ్రి తన కొడుకును చూసి గర్విస్తూ ఉండేవాడు. ఆయన కొక్కటే కోరిక ఉండేది. తన కొడుకును తనను మించిన సంగీత విద్వాంసుడిగా చెయ్యాలి. తాను సాధించలేని మరికొన్ని విజయాలను అతడు సాధించాలి. ఆ ఆశయంతోనే ఒక మంచిరోజు చూసి ఆటలకని బయటికి పోబోతున్న శ్రీహరిరావును ఆపి కూర్చోబెట్టాడు. ఆనాటి విషయం తలుచుకుంటే శ్రీహరిరావు కళ్లల్లో నీళ్లు తిరుగుతాయి. తాను తన తండ్రికి ద్రోహం చేశాడు....తనకు తాను కూడా ద్రోహం చేసుకున్నాడు. ఆనాడు బడికి సెలవు కావటం మూలాన స్నేహితు లందరూ ఊరికి మైలు దూరంలో ఊరచెరువులో ఆటల ప్రోగ్రాం వేసుకున్నారు. సాయంకాలం కాగానే ఆటలకని తాను బయటికి పరుగెత్తి పోతూవుండగా తండ్రి పిలిచాడు. ఆయన ఎంతో ప్రశాంతంగా గోడవార చాపమీద కూర్చుని ఉన్నాడు. ఎన్నో నెలల నుంచీ దగ్గూ, ఆయాసమూ ఆయనను విపరీతంగా బాధ పెడుతున్నాయి. ఊళ్లో ఉన్న ఆయుర్వేద వైద్యుడి దగ్గర మందులు వాడుతున్నా గుణం ఏమీ కనుపించటంలేదు. ఉండి ఉండి దగ్గు భయంకరంగా ఆయనను లొంగదీసుకుని సతమతం చేస్తూనే ఉంది.

తండ్రి పిలవగానే శ్రీహరిరావు వెనక్కు తిరిగివచ్చి 'ఏం కావాలి ?' అన్నట్టు చూశాడు. ఆయన కళ్లలో చిత్రమైన వెలుగు. ఒక్క క్షణంసేపు .... తర్వాత ఆయనకు ఏదో అధైర్యం కలిగింది. అయినా తమాయించుకుని కొడుకును 'కూర్చోమ' ని సైగచేసి కొద్ది క్షణాల నిశ్శబ్దం తర్వాత ఎంతో ఆర్ద్రంగా, ప్రేమగా "నాయనా ! శ్రీహరీ ! నీకు వీణ నేర్పుదామని ఉందిరా ! ఎన్నాళ్లగానో అనుకుంటున్నాను. ఇతరులకు ఎందరికి చెప్పినా నాకు తృప్తి లేదు. నువ్వు నేర్చుకోవాలి. నువ్వు నన్ను మించినవాడు కావాలి. ఆ గదిలో ఉన్న వీణ యిలా జాగ్రత్తగా పట్టుకురా" అన్నాడు. తనకు ఎంతో ఆశాభంగమైంది. అయినా చేసేదేమీలేక వీణ తీసుకువచ్చి ఆయన ముందు ఉంచి తాను కూడా అక్కడే కూర్చున్నాడు. ఆయన వీణపైని కవరు తీసి తీగలను ఆప్యాయంగా మీటుతూ నెమ్మదిగా అర్ధనిమీలితనేత్రాలతో ఏవేవో శ్లోకాలు ఉదహరించి సంగీత మహాత్మ్యాన్ని వర్ణించాడు. అంతసేపూ శ్రీహరిరావు మనస్సు ఊరికి దూరంగా చెరువులో పరుగులు పెడుతూ, కేరింతలు కొడుతూ, పందేలు వేసుకుని ఆటలాడుతున్న స్నేహితులమీదే ఉంది. తండ్రి చెబుతున్న దేమిటో

అతని బుర్ర కెక్కడంలేదు. ఎప్పుడెప్పుడు జారుకుని పారిపోదామా అనే ఆలోచన తప్ప మరేదీ మనసులో లేదు. ఇంతలో ఉన్నట్టుండి ఆయన విపరీతంగా దగ్గటం ప్రారంభించాడు. ఎడమచేతితో గుండె పట్టుకుని నిముషాల తరబడి దగ్గి దగ్గి వూపిరి ఆడక, ఆయాసంతో బాధపడి, చివరకు కళ్లు మూసుకుని గోడ కానుకుని కూర్చుండిపోయాడు. శ్రీహరి మొదట్లో తండ్రి అవస్థ చూసి కంగారుపడిన మాట వాస్తవమే. కాని కొద్ది నిముషాల తర్వాత ఆయన కళ్లు మూసుకుని ప్రశాంతంగా గోడ కానుకుని ఉండిపోవడంతో అతడు కుదుటబడ్డాడు. వెంటనే లేచి తలుపులు దగ్గరగా లాగి బాణంలాగా పరుగెత్తి వీధిలోకి వెళ్లిపోయాడు. ఇంట్లో అతని తల్లి, అక్క యిద్దరూ లేరు. శ్రావణమాసం కావడం వల్ల వా రిద్దరూ అంతకుముందే పేరంటాలకు వెళ్లి ఇంకా తిరిగి రాలేదు. శ్రీహరి బాణం నుంచి బాగా లాగి వదలిన అంబులాగా అలా వేగంగా పరుగెత్తిపోయి స్నేహితులను సరిగ్గా వేళకు కలుసుకున్నాడు. అప్పుడే ఆట మొదలుపెట్టబోతున్నారు. అప్పటికి విశ్వనాథం దొంగ .... అతడు దూరంగా పరుగెత్తుకు వస్తున్న శ్రీహరిరావును చూసి 'అదుగో వాడొస్తున్నాడుగా .... మే మిద్దరం చప్పట్లు వేస్తాం' అన్నాడు. ఆవిధంగా నయినా దొంగ పెట్టడం తప్పుతుందని వాడి ఆశ. అయినా ఆ ఆశ ఫలించలేదు. అతడే మళ్లీ దొంగ పెట్టవలసి వచ్చింది. అప్పటినుంచీ బాగా పొద్దు గూకేవరకూ కేరింతలు పెడుతూ పిల్ల లందరూ హుషారుగా ఆడుకున్నారు. తర్వాత కాసే పు కబుర్లు చెప్పుకున్నారు. ఆతర్వాత యిళ్లకు బయులుదేరారు. అప్పటిదాకా జగాన్ని తన కోటి కిరణాలతో ముంచి ఎత్తిన సూర్యబింబం ఏ కొండ మాటునో క్రుంగిపోయింది. నల్లని చీకటి ఒక మహాసముద్రంవలె ప్రపంచాన్ని ఆవరించి తన పాలన ప్రారంభించింది. ఆకాశం నల్లని జలార్ద్రమైన మేఘాలతో నిండి, ఉండి ఉండి గర్జిస్తున్నది. శ్రీహరిరావు వంటరిగా నడుస్తున్నాడు. నల్లని చీకటి ప్రతిపదార్థాన్నీ గాఢంగా, భయంకరంగా కౌగిలించుకుంటున్నది. దానికి తోడు చిన్న చిన్న చినుకులు కూడా పడటం మొదలైంది.

శ్రీహరిరావు మరొక ఫర్లాంగు దూరం నడవవలసి ఉండగానే వర్షం పెద్దదయింది. నల్లని ఆకాశంలో కొలువై ఉన్న ఏవో అజ్ఞాత భయంకర శక్తులు భూమి మీద కసి తీర్చుకుంటున్నట్టు దారుణంగా వర్షం నిలిచి కురుస్తున్నది. చుట్టూ చిమ్మ చీకటి. చుట్టూ కుంభవృష్టి.

అతడు తడుస్తూనే పరుగెత్తడం ప్రారంభించాడు. ఊరి పొలిమేరమీద పెద్ద వేపచెట్టూ, దాని క్రింద గ్రామదేవత గుడీ, గుడిముందు కొద్ది గజాల దూరంలో పాతిపెట్టబడిన రాయీ అన్నీ ఒక మెరుపు వెలుగులో కనిపించాయి. శ్రీహరిరావుకు భయంతో గుండెలు దడదడ లాడినా అతడు పరుగు మాత్రం మానలేదు. అతడు పరుగెత్తుతున్నా గ్రామదేవత గుడీ, దాని ముందున్న రాయీ, వీటిని గురించే అతని ఆలోచన .... దానిని గురించిన వింత కథ ఒకటి ఉంది... పెద్దవాళ్లు చెప్పుకుంటూ ఉంటారు. గ్రామదేవత రాత్రిళ్లు ఊరికి తిరిగి వస్తున్న ఎవరికో తెల్లని చీరెతో, నుదుట పెద్ద కుంకుమబొట్టుతో కనిపిస్తూ ఉండేది. ఒకసారి ఆ ఊరికి ఒక పొరుగూరి వ్యక్తి వచ్చాడు. అత డెక్కడివాడో తెలియదు. వచ్చి ఊరి మధ్య మరొక గుడి అరుగుమీద పడుకున్నాడు. రాత్రి బాగా పొద్దుపోయిన తర్వాత గ్రామదేవత ఊరిమీద తిరుగుతూ అటు వచ్చింది. అత డామెను చూసి తెలుసుకుని 'అదేమిటి ? నువ్విలా ఊరి మీద తిరుగుతు ఉంటే ఎలాగమ్మా ? సామాన్య మానవులు, బలహీనులు నిన్ను చూసి గుండెలు బద్దలై చచ్చిపోతారు. ఇలా రావడం నీకు తగదు....' అని అప్పటికప్పుడు లేచి ఆమెతో ఊరి బయటి గుడి దగ్గరికి వెళ్లి, ఆ గుడిముందు ఒక రాయి పాతి తన మంత్రశక్తితో దిగ్బంధనం చేశాడు. అంటే మరెన్నడూ గ్రామదేవత ఆ రాయి దాటి యివతలికి రాలేదన్నమాట .... ఆ చుట్టుపక్కల చిన్న ఊళ్లన్నిటికీ పొలిమేరలలో యిటువంటి గ్రామదేవత లున్నారు. వారికి తలా ఒక పేరూ .......

శ్రీహరిరావు తమ వీధి మలుపు తిరిగేసరికి ఒక్కసారిగా మరొక ప్రపంచంలోకి వచ్చినట్టయింది. వీథి మొదటినుంచే తమ యింటి పంచలో వెలుగుతున్న పెట్రొమాక్సు లైటు కనిపించింది. ఆ వూళ్లో వీరయ్య యింట్లో తప్ప పెట్రొమాక్సు లైటు లేదు. అతడు దాన్ని ఎవరి యింట్లో ఏ సందడి అయినా తీసుకువచ్చి యిచ్చి సహాయం చేస్తూ ఉంటాడు. ఇప్పుడా లైటు తమ యింటి కెందుకు వచ్చింది ? అతడు తడిసి నిలువెల్లా నీళ్లు కారుతూ మెట్లెక్కుతూ ఉండగానే అరుగుమీద కూర్చొనిఉన్న వీరయ్యలేచి పెద్దగా 'ఇదుగో చిన బాబు గూడా వచ్చాడు' అంటూ అతని భుజం పట్టుకుని వరాండాలోకి కాక మరొక ప్రక్కకు తీసుకుపోయాడు. వరండాలోనుంచి ఏడుపులు వినవస్తున్నాయి. ఒక పక్క యింటి యజమాని శవం పడుకోబెట్టబడి ఉంది. శవానికి తలవైపు గాలికి రెపరెప లాడుతున్న చిన్న దీపం ఉంది .... ఎవరో 'పసివాడు అటువైపు తీసుకు వెళ్లవద్దు. భయపడతాడేమో .....' అన్నారు. వీరయ్య అతన్ని పంచలో రెండో వైపుకు తీసుకువెళ్లాడు. వరాండాలో ఏడుపులు మరింత ఎక్కువైనాయి. శ్రీహరి ఒక్కసారిగా 'బావురు' మన్నాడు.

కొద్దిసేపు గడిచింది. అతడు వెక్కివెక్కి ఏడుస్తూనే ఉండి ఉండి శవంవైపు చూస్తున్నాడు. గొంతు నుంచి పాదాలవరకు తెల్లని గుడ్డ కప్పారు. ఆయన అంతకు ముందు దగ్గుతో ఎన్నాళ్లుగా ఎంత బాధపడినప్పటికీ ఇప్పుడు ముఖం ప్రశాంతంగా ఉంది. నిద్రపోతున్నవాడివలె ఉన్నాడు. రెండు కాళ్ల బొటనవేళ్లూ దగ్గరగా కలిపి తాడుతో కట్టి ఉంచారు ...... అలా చచ్చిపోయినవారి కాలి బొటనవ్రేళ్లను ఎందుకు కట్టి ఉంచుతారో, తలవైపు దీపం ఎందుకు ఉంచుతారో శ్రీహరిరావుకు యిప్పటికీ తెలియదు .... సరే

తన కిప్పటికీ తెలియని విషయాలు లెక్కకు మిక్కిలిగా ఉన్నాయనుకో. ఆ మరునాడే సూర్యోదయంతో పాటుగా వూళ్లో నలుగురూ పూనుకుని అన్ని ఏర్పాట్లూ చేశారు. శ్రీహరిరావు చాలా చిన్నవాడు కావడంచేత అపసర విధుల నిర్వాహణకు ఎవరో ఒక మనిషిని మాట్లాడి తీసుకువచ్చారు. వాకిట వచ్చి వెదురుబద్దలతో ఏడుకట్ల సవారీ సిద్ధమైంది. శవాన్ని యివతలికి తీసుకువచ్చి స్నానం చేయించారు. తర్వాత నలుగురు మనుషులు మోయగా, ముందొక మనిషి తడిగుడ్డలతో, చేతిలో నిప్పులున్న క్రొత్త కుండతో నడవగా, అభిమానులైన వారూ వీరూ వెంట నడవగా శ్రీహరిరావు తండ్రి అంతిమ ప్రయాణం సాగిపోయింది. అతని తల్లి తలను నేలకు బాదుకుని విలపించడమూ, అతని అక్క వెక్కివెక్కి ఏడవటమూ చూసి మళ్లీ శ్రీహరిరావు బావురుమన్నాడు.

తండ్రి మరణం శ్రీహరిరావు మనసులో చెరగని ముద్ర వేసింది. అతడు ఆ పసియీడులోనే ఎంతగానో బాధపడ్డాడు. ఆనాడు తాను ఆటలకని పోబోతూఉండగా ఆపి ఎంతో ప్రశాంతంగా మాట్లాడిన తండ్రి ప్రసన్నవదనం గుర్తుకువచ్చినప్పుడల్లా క్రుంగిపోయేవాడు. మనసులో ఎక్కడో, ఏ మూలనో 'తండ్రికి తాను ద్రోహం చేశాడ' ని అనిపిస్తూ ఉండేది. ఆయన వదిలి వెళ్లిన వీణ ఒకమూల అలాగే ఉండేది. దాన్ని ఎంతోకాలం వరకూ ఎవరూ తాకనైనా లేదు. గుడ్డసంచీలో గోడమూల నిలబెట్టబడి ఉన్న ఆ వీణ ఎవరో మనిషి ముసుగు వేసుకుని కూర్చుని ఉన్నట్టుండేది. చీకటిరాత్రులలో తల్లినో, అక్కనో కౌగలించుకొని పడుకునే శ్రీహరిరావు ఎప్పుడైనా మెలకువ వచ్చి అటు చూస్తే గుండెలు భయంతో దడదడలాడేవి.

అతనిలో యిప్పటికీ సంగీతంపట్ల ఉండే విపరీతమైన మక్కువకు కారణం ఆనాటి సంఘటన అని శ్రీహరిరావు నమ్మకం. ఇప్పటికీ అతడు ఎక్కడ ఏ కచేరీ జరిగినా, ఎంత దూరమైనా సరే నడిచివెళ్లి విని వస్తూ ఉంటాడు. ఒకవేళ ప్రవేశ రుసుము ఉండి కొన్ని కచేరీలకు లోపలికి రానివ్వకపోతే బయట నిలబడి అయినా విని కానీ కదలలేడు. తండ్రి తనకు సంగీతంపట్ల అభిమానం కలిగించాడు. కాని ఆయన కల ఫలించనేలేదు. తనకు అభిమానమే కాని ప్రవేశం లేదు. అటువంటి అవకాశమే జీవితం తన కెన్నడూ ప్రసాదించలేదు. పైగా హృదయవిదారకమైన విషయం ఏమిటంటే తన తండ్రి ప్రాణప్రదంగా చూసుకుని మిగిల్చిపోయిన ఆ వీణను కూడా అమ్మివేయవలసిన దుర్గతి పట్టింది. ఆ విషయం తలుచుకున్నప్పుడల్లా అతని కళ్లవెంట నీళ్లు తిరుగుతాయి. అందుకు కారణభూతుడైన బావగారిని తలుచుకుంటే చిరాకు కూడా కలుగుతుంది..... అతని అక్కకు ఈ సంబంధం స్థిరపడేసరికి పధ్నాలుగు సంవత్సరాల వయస్సు. తాము ఉంటున్నది పల్లెటూరు. ఆడపిల్లకు అంత యీడు వచ్చేవరకూ పెళ్లి చేసి పంపకుండా యింట్లో ఉంచుకోవటం ఒక పెద్ద అపచారం. పన్నెండేళ్లు కూడా నిండకుండానే ఏ ముసలివాడికో, కుంటివాడికో, గ్రుడ్డివాడికో అయినా సరే యిచ్చి పెళ్లి చెయ్యి. ఫరవాలేదు. అలా చెయ్యకపోయావో నలుగురూ నీమాటే చెప్పుకుంటారు. నీకు పరిస్థితులు కలిసిరాకపోయినా, స్తోమతు లేకపోయినా సరే వారి కనవసరం. కాకులు పొడిచినట్టు పొడుస్తారు. ఊళ్లో తలెత్తుకు తిరుగనివ్వరు. తమ విషయంలోనూ అదే జరిగింది. తన తండ్రి చనిపోయేనాటికి కొంత అప్పు తప్ప నిలవ కానీ కూడా లేదు. ఆయన బ్రతికి ఉండగా అందరూ ఆయన దగ్గర అప్పుడప్పుడు ధన సహాయం పొందినవారే. కాని ఆయన పోయిన తరువాత ఎవరూ 'ఇదుగో .... ఆ మారాజుకు యింత బాకీ ఉన్నాం' అని తెచ్చి యిచ్చిన పాపాన పోలేదు. ఒక్క వీరయ్య మాత్రం తన లెక్క పుస్తకంతోపాటు రెండు వందల రూపాయలు కూడా తెచ్చి యిచ్చి తన ఋణం తీర్చుకున్నాడు. పొలం చేస్తున్న రైతులేమో పొగాకు పండించి అమ్మి డబ్బు చేసుకోవడమైతే నేర్చారు కాని, భూకామందులకు కానీ యివ్వడం కూడా వారికి కష్టమైంది. శ్రీహరిరావు తల్లి కొడుకును వెంటబెట్టుకుని వారి చుట్టూ ప్రాధేయపడుతూ తిరిగితే నసుగుతూ కొంతకు కొంత ముట్టజెప్పేవారు. అది కాస్తా యింట్లో జరుగుబాటుకే చెల్లిపోయేది. దానికి తోడు 'ఆడపిల్ల పెద్దమనిషై కూర్చుందే' అంటూ చుట్టుపక్కలవారు .... ఈ పరిస్థితులలో వీరయ్య ఒక్కడే వీళ్లకు దిక్కు అయినాడు. అతడు కాలికి బలపం కట్టుకుని ఆవూరూ, యీ వూరూ తిరిగి విచారించి యీ సంబంధం కుదిర్చాడు.

ఈపాటికి బావగారు యింటికి వచ్చే ఉంటాడు. ఆఫీసు వేళ అయిందిగా .... పొద్దున్న పాలమనిషి రాలేదని కోపంతో బజారుకు వెళ్లిపోయాడని చెప్పిందికదూ అక్కగారు ? బహుశా శుభ్రంగా, సుష్టుగా కాఫీ త్రాగే వచ్చిఉంటాడు. ఆమె లేక బాధపడితే మాత్రం ఆయనకు పట్టిందా ? ఈ బావగారివల్లనే తన తండ్రి మిగిల్చిపోయిన వీణను కూడా అమ్మవలసి వచ్చింది. ఈయన తక్కువవాడా ? పెళ్లి అయిన కొత్తలలో ఒకసారి పండుగకు వచ్చి మామూలు ధోవతులు చదివిస్తే వాటిని విసిరికొట్టి అలిగి లేచి పోబోయినాడు. తర్వాత పక్కనే ఉన్న వీరయ్య వచ్చి బతిమాలి 'అసలు సంగతేమిట' ని అడిగితే "పట్నంలో చదువుకుంటున్న తనకు ఆ అసహ్యపు ముతక ధోవతులు పెడితే వూరుకుంటానా ?" అని కోప్పడ్డాడు. అక్కయ్య అప్పుడు గోడ ప్రక్కనే నిలబడి కళ్లు తుడుచుకున్నది. .... వీరయ్య అది విని "ఓస్. ఇంతేకదా ! ఈమాత్రం దానికే ఇంత తొందర ఎందుకు ? నేను మీకు కావలసినట్టు అన్నీ జరిపిస్తాను. సరేనా ?" అని ఒప్పించి లోపలికి వచ్చి శ్రీహరిరావు తల్లితో ఆలోచించాడు. ఆమె కేమీ పాలుపోలేదు. "ఏంచెయ్యాలో నువ్వే చెప్పు వీరయ్యా ! అన్నిటికీ నువ్వే ఉన్నావు." అన్న దామె. వీరయ్య దగ్గర కూడా అప్పుడు డబ్బు ఏమీ లేదు. అతడూ యిబ్బందులలో ఉన్నాడు. అతడు ఇల్లంతా కలయజూచాడు. అతని చూపులు గదిలో మూలగా ఉన్న వీణమీద నిలిచాయి. శ్రీహరిరావు తల్లి

అర్థంచేసుకుని తల వంచుకుని "సరే .... ఇక ఏమి మిగిలి లేదు అది తప్ప. దాన్ని పట్నం తీసుకువెళ్లి ...." అంటూనే కంఠం పూడుకుపోగా ఆగిపోయింది. ఆమె తల ఎత్తేసరికి కళ్లలో నీటిపొర నిలిచింది. వీరయ్య ఒక్క క్షణం ఆగి 'సరే .... ఏం చేస్తాం .... ఇక అదే శరణ్యం' అంటూ లేచి ఆ వీణను తీసుకుని పెరటిగుమ్మంలోనుంచి తన యింటికి తీసుకువెళ్లి ఆ మధ్యాహ్నమే ఎద్దుల బండిలో పట్నం పోయి అక్కడ ఏ సంగీత పరికరాల షాపులోనో దాన్ని తెగనమ్మి డబ్బు తీసుకువచ్చి యిచ్చాడు. అందులో కొద్దిగా ఇంటి ఖర్చులకు ఉంచుకుని శ్రీహరిరావు తల్లి అతనిచేత ఒక యాభై రూపాయలు అల్లుడి చేతిలో పెట్టించి చాటున ఉండి "మీకు నచ్చిన బట్టలు కుట్టించుకోండి బాబు" అని చెప్పింది. అలా తన తండ్రి చివరి జ్ఞాపకచిహ్నం కూడా కాళ్లు వచ్చినట్లు యింటోనుంచి నడిచి వెళ్లిపోయింది. తన బావగారు యిప్పటికీ ఏమీ మారలేదు. ఆ తత్వం యిక మారదు కాబోలు ! ....

శ్రీహరిరావు ఉలిక్కిపడ్డాడు. ఎలక్ట్రిక్‌బెల్ మరొక అరగంట అయిపోయినట్లు సూచిస్తూ 'గణగణ' మని మ్రోగుతున్నది. వాచర్ల బూట్ల చప్పుడూ, కాయితాల రెపరెప ధ్వనులూ వినవస్తున్నాయి. అందరూ ఏకాగ్రతతో ఏమిటో వ్రాస్తున్నారు.

మళ్లీ కొద్ది క్షణాలలోనే పరీక్ష హాలులో నిశ్శబ్దం వ్యాపించింది. శ్రీహరిరావు సర్దుకు కూర్చుని మళ్లీ పైకప్పు వంక చూస్తూ ఆలోచనలో పడ్డాడు.

## 3

అతని తండ్రి చనిపోయినప్పటినుంచీ యింటి పరిస్థితులు తారుమారైనాయి. అప్పుడప్పుడు నిత్యావసర వస్తువులకు—బియ్యమూ, ఉప్పూ, పప్పూ వంటి వాటికే .... యిబ్బందిగ ఉండేది. ఆడపిల్ల పెళ్లితో అంతవరకు ఉంటూ వచ్చిన చెరువుక్రింది మాగాణి భూమి ఎకరంన్నర చెల్లిపోయింది. అంతకుముందు అది ఉండి ఒరిగించిందేమీ లేదు. వర్షాలు విపరీతంగా కురిసి చెరువు నిండితే ఏవో నాలుగు గింజలు రాలుతూ ఉండేవి. రైతులు దాన్ని పాలికిచేస్తూ వచ్చిన ధాన్యంలో కొంత ముందే దాచుకుని, కొంత చూపించి అందులో సగం తమకు యిస్తూ ఉండేవారు. అదీ చెరువు నిండితేనే. లేని సంవత్సరం పంట ఎండిపోయేది. రైతు తమకు కూడా సున్నా చుట్టేవాడు.

ఆ ఎకరన్నర భూమి పోగా వారికి రైలుకట్ట పక్కన మూడెకరాల మెట్ట పొలం మిగిలింది. శ్రీహరిరావు తండ్రి ఎన్నో ఏళ్ల క్రిందట ఆ భూమిని ఎవరో రైతుకు సాలీనా కేవలం పది రూపాయిల మక్తాకు ఒకేసారి పదిహేను సంవత్సరాలకు కౌలు వ్రాసి యిచ్చాడు. ఆ రైతు ఆ పొలంలో పొగాకు వేసిన సంవత్సరం మరొక అయిదు రూపాయలు అదనంగా యిచ్చేట్టు కౌలులో షరతు ఉంది. ఆ రైతు ప్రతి సంవత్సరమూ పొగాకే వేసి ఆ మూడెకరాల పొలం మీదనే వేలకు వేలు సంపాయించాడు. శ్రీహరిరావు తండ్రి బ్రతికిఉండగా ఆయన సకాలంలో వెళ్లి రైతు దగ్గర ప్రతి సంవత్సరమూ మక్తా సాధించుకు వచ్చేవాడు. ఆయన పోయిన తర్వాత సంవత్సరానికే కౌలు గడువు చెల్లిపోయింది. శ్రీహరిరావు తల్లి ఒకనాడు కొడుకును వెంటపెట్టుకొని అంత దుఃఖంలోనూ తప్పదు కనుక మైలు దూరమూ నడిచి రైతు యింటికి వెళ్లి మాట్లాడింది. ఆ లోగిలి అంతా లెక్కలేనంతమంది పనివాళ్లతో హడావిడిగా ఉంది. పొగాకు పదునుచేసేవారు, కట్టలు కట్టేవారూ, ఇంకా యితర పనులు చేసేవారూ గంద్రగోళంగా తిరుగుతున్నారు. ఆరైతు నల్లగా లావుగా ఉన్నాడు. మొహాన స్ఫోటకపు మచ్చలున్నాయి. అరుగుమీద గోడ నానుకుని కూర్చుని పొగాకు పాయ తీసి చుట్ట చుట్టుకుంటున్నాడు. శ్రీహరిరావు తల్లి తన గోడు చెప్పుకోవటమే తప్ప అతడు పెదవి కదిపి ఒక్క మాట కూడా ఆడలేదు. అంతా అయిన తర్వాత అస్పష్టంగా, "కౌలు మళ్లీ రాసుకుందాం. మక్తా ఎక్కువచేసి రాసి యిస్తాను" అన్నాడు. శ్రీహరిరావు తల్లి "ఎక్కువచేసి యిస్తానంటే సరిపోదు. ఎప్పుడో పదిహేనేళ్ల క్రిందట తెలిసో తెలియకో తక్కువకు యిచ్చాము. ఇప్పుడు వారూ, వీరూ నూరు రూపాయలదాకా యిస్తామని వస్తున్నారు. అలా నువ్వే యిస్తానంటే సరి. లేదా భూమి మరొకరికి యిచ్చుకుంటాను." అన్నది. ఆమె చాలా సాహసంచేసి ఆ మాటలు అన్నది. రైతు వెంటనే తల ఎత్తి గంభీరంగా "ఆ వచ్చేవాడెవడో రమ్మను .... అట్లాగే భూమి వదలిపెడ్తాను" అన్నాడు. అప్పటికిగాని శ్రీహరిరావు తల్లి తాను తొందరపడి మాట్లాడి పరిస్థితి పాడుచేశానని గ్రహించలేదు. ఇంటిదగ్గర వీరయ్య రోజూ చెబుతూనే ఉన్నాడు. "ఆ రైతు భూమి స్వాధీనమూ చెయ్యడు. మక్తా రేటును పెంచనూ పెంచడు. వాడితో యితరు లెవరూ పోటీకి వెళ్లి భూమి చెయ్యలేరక్కడ. ఎంత సేపటికి మంచిగా మాట్లాడి ముళ్లమీద గుడ్డను యివతలికి తీసుకున్నట్టు వ్యవహరించాలి, మనం" అంటూనే ఉన్నాడు.

ఆమె మళ్లీ "అయితే నువ్వు ఎంత యిస్తానంటావూ ?" అని అడిగింది. అతడు నవ్వి, "నువ్వీ బాధలన్నీ ఏం పడగలవు లేవమ్మా. నేను పాతికో ముప్ఫయ్యో యిస్తే మాత్రం నీకేం చాలుతుంది ? ఆ పొలం ఏ మూల ఎక్కడుందో కూడా మీకు తెలియదు కదా ? ఏదో రేటు చేసుకుని అమ్మేసి విరగడ చేసుకోరాదూ ?" అన్నాడు. అంటే కొనేందుకు కూడా వాడిమీదికి ఎవరూ పోటీకి రారు. వాడు చెప్పిందే ధర.

ఆమె కాదన్నది. ఇద్దరూ కాసేపు వాదించుకుని మక్తా సాలీనా నలభై రూపాయలకు ఒప్పందానికి వచ్చారు. ఆమెకా భూమి అమ్మటం అప్పట్లో సుతరామూ యిష్టంలేదు. అయినా తరువాత రెండేళ్లకే ఏ భూమి ఏ రైతుకు అమ్మకూడ దనుకున్నదో ఆ రైతుకు ఆ భూమినే అమ్మవలసి వచ్చింది.

తరవాత రోజులు చాలా నెమ్మదిగా గడిచాయి. శ్రీహరిరావు బడి ఉన్న రోజులలో పొద్దున వెళ్ళి సాయంకాలం తిరిగి వచ్చేవాడు. సెలవు రోజులలో ఆటవిడుపు ఉండేది. బడి ఉన్న రోజులలో అతని తల్లికి చాలా బాధగా ఉండేది. అంతా తన్ను వదిలిపోగా మిగిలినవాడు శ్రీహరిరావు ఒక్కడు. ఆడపిల్లను అత్తవారు తీసుకువెళ్ళి సంవత్సరాలు గడిచిపోయాయే గాని ఒక్క పండక్కు కూడా వారు ఆ పిల్లను పుట్టింటికి పంపలేదు. ఎప్పుడైనా అల్లుణ్ణీ కూతుర్నీ పంపమని జాబు వ్రాస్తే "మీరు ఇంతకుమునుపు చేసిన మర్యాదలు చాలు. వాళ్లను పంపేందుకు వీలులేదు" అని ఆ పిల్ల మామగారు నిర్మొహమాటంగా జవాబు వ్రాసేవాడు. తల్లి ప్రాణం కాబట్టి ఉండబట్టలేక, ఆమె జంకు విడిచి తానే అక్కడికి వెళ్లి ఒకపూట ఉండి పిల్లను చూసుకుని వచ్చేది. దానితో అక్కడ అత్త మామలు, భర్త ఆమెను నీచంగా, హీనంగా చూడటం తెలిసివచ్చి ఆమెకు అదొక మనోవ్యథ అయి పోయింది. ఆపిల్లను అక్కడ అందరూ దాసిదానికన్నా హీనంగా చూస్తారనీ, తెల్లవారింది మొదలు అర్ధరాత్రిదాకా యింటెడు చాకిరీ చేయలేక మల్లెపువ్వు వంటి పిల్ల మసిబొగ్గులా తయారయిందని తల్లికి తెలిసింది. ఇంతకూ కారణం ఆమె బీదయింటి పిల్ల కావటం .... కట్నం, కానుకలూ, మర్యాదలూ ఘనంగా జరక్కపోవడం .... శ్రీహరిరావుకు బావగారిని తల్చుకుంటే అందుకే యిప్పటికీ అసహ్యం. ఆతని అక్కగారి స్థితి ఈరోజుకు అలాగే ఉంది. ఇంట్లో ఆడదానికి ఉండవలసిన గౌరవనీయమైన స్థానం ఆమెకు ఆమాత్రమూ లేదు. అత్త మామలు పోయినా, ఆమె ఏష్టాలూ, మనోవ్యథా తప్పనేలేదు. ఆమె కవి జీవితపర్యంతమూ తప్పవేమో ! ఆ రోజులలో శ్రీహరిరావు తల్లి పొద్దువాటారగానే వీథి గుమ్మంలోకి వచ్చి కొడుకు కోసం ఎదురుచూస్తూ ఉండేది. అతడు భుజాన సంచీతో, చేతిలో కారియర్‌తో నడిచివస్తూ వీథి మొదట్లో కనిపించగానే ఆమె కళ్ళు తృప్తితో మెరిసేవి. అతన్ని లోపలికి తీసుకువెళ్లి ఆమె వేడి వేడి నీళ్లతో స్నానం చేయించి దగ్గర కూర్చుని అన్నం తినిపించేది. తర్వాత తాను ఫలహారం ముగించి ఆరుబైట వెన్నెట్లో పక్కవేసి కొడుకును దగ్గర పెట్టుకొని పడుకునేది. శ్రీహరిరావుకు తల్లి అంటే మొదటినుంచీ అంతులేని ప్రేమ. ఆటువంటి రాత్రులలో తల్లి దగ్గర పడుకుని అతడు తమ స్కూలు కబుర్లు చెబుతూ ఉండేవాడు. తాను స్కూల్లో కొక్కో' ఆటలో ఎలా గెలిచిందీ, రంగడు యింటి కిచ్చిన లెక్కలు చేయక, పీరియడంతా ఎలా బల్లమీద నుంచోవలసి వచ్చిందీ చెప్పేవాడు. ఆమె కతని మాటలు ఎంతో ఆనందం కల్గించేవి. పట్నంలో బస్సులూ, లారీలూ వేగంగా రోడ్లమీద పోతూఉండటం తలుచుకొని ఆమె ప్రతిరోజూ అతడు బడికి వెళ్లేటప్పుడు "జాగ్రత్తగా వెళ్లు నాయనా !" అంటూ ఉండేది. తాను ఫరవాలేదు లేమ్మా అని చెప్పి వెడుతూ ఉండేవాడు. అయినా ఆమెకు భయమే. నిజమే మరి. తనతో చదువుకుని, తనతో ఆడుకున్న ఉమాపతి కుంటివాడై జీవితాంతమూ ప్రక్కవారికి బరువుగా జీవచ్ఛవంలా తయారయింది లారీ ప్రమాదంవల్ల కదూ ! ......

ఆ తరువాత వేసవిలో ఒకరోజున ఫోర్తుఫారమ్ పరీక్షా ఫలితాల కోసం శ్రీహరిరావు 'చిచ్చుబుడ్డి' తో కలిసి పట్నం వెళ్లాడు. స్కూల్లో ప్రవేశించేసరికి ఎండ మండిపోతున్నది. వెచ్చనిగాలి సమస్త విశ్వాన్నీ నిస్తేజం చేస్తూ బాణవేగంతో వీస్తున్నది. స్కూలు ఆవరణలో పిల్ల లందరూ పరీక్షా ఫలితాల కోసం గుమిగూడి అల్లరి చేస్తున్నారు. ఇంతలో హెడ్మాష్టరు రూమునుంచి బంట్రోతు ఒకడు టైపు చేయబడిన నంబర్లున్న కాయితాన్ని తీసుకువచ్చి ఆరు బయట నల్లబల్లమీద అంటించి వెళ్లాడు. అక్కడితో పిల్లల తొక్కిడి ప్రారంభమయింది.... ఉత్సాహంతో వెలిగిపోతున్న మొహాలతో కొందరూ, నిరుత్సాహంగా నల్లబడిన మొహాలతో కొందరూ యువతలకు వస్తున్నారు. శ్రీహరిరావు పక్కనే నిలబడి ఉన్నాడు. అతని నంబరు కూడా చూసి వస్తానని 'చిచ్చుబుడ్డి' పిల్లలను తోసుకుంటూ లోపలికి వెళ్లాడు. వాడసలే పొట్టివాడు కావడంవల్ల ఎక్కడున్నాడో కనిపించటం లేదు. శ్రీహరిరావుకేమో మనసులో ఆదుర్దాగా ఉంది.

ఇంతలో ఇద్దరు పిల్లలను పక్కకు తొలగించి చిచ్చుబుడ్డి' తల బైటికి పెట్టి "శ్రీహరీ ! నేను పాసయ్యాను రోయ్ ! నీ నంబరు మాత్రం కనిపించలేదు. .... అయినా మళ్లీ చూస్తాను" అంటూ మాయమయిపోయాడు.

శ్రీహరిరావు గుండెలు దడదడ లాడుతున్నాయి. అతని శరీరం ఒక్కసారి నిలువెల్లా ఒణికిపోయింది. తన నెంబరు లేదు..... తన నెంబరు లేదు.... తన నెంబరు లేదు. తాను తప్పాడు. ఇంక ఇంటికి ఏ మొహం పెట్టుకొని వెళ్లగలడు ? తనకోసం వేయి కళ్ళుగా ఎదురుచూసే తల్లికి ఏం సమాధానం చెప్పగలడు ? "పాసయినా" నంటే కొండెక్కినంత సంతోషిస్తుం దామె. "తప్పిపోయాన'ని ఎలా ఆమెకు చెప్పడం ?

చిచ్చుబుడ్డి శ్రీహరిరావు చెయ్యి పట్టుకున్నాడు. ఆయాసంతో "ఒరేయ్ ! నీ నెంబరు లేదురా. ఎంతో జాగ్రత్తగా చూశాను...." అన్నాడు కళ్లలో సానుభూతి వర్షిస్తూ.

శ్రీహరిరావు నడక సాగించాడు. చిచ్చుబుడ్డి వెనక పరుగెత్తుకుని వస్తూ "ఒరేయ్, మనవాళ్లను కూడా రానివ్వు. ముందే వెళ్లిపోతావేం ?" అంటున్నాడు. శ్రీహరిరావు వెనుదిరిగి "మీరు తర్వాత రండి .... నేను మా బంధువుల ఇంటికి వెళ్లి వాళ్లను చూసి రావాలి" అని సాగిపోయాడు. చిచ్చుబుడ్డి యిటు శ్రీహరిని వదలలేక, అటు మిగిలిన స్నేహితులను వదలలేకా, ఒక క్షణం నుంచుని ఆలోచించి తర్వాత నెమ్మదిగా స్కూలువైపు సాగిపోయాడు.

ఎండ తగ్గుముఖం పట్టింది కాని వెచ్చని గాలి నిప్పులమీది నుంచి వలె వీస్తూనే ఉన్నది. ఇంకా చల్లనిగాలి మళ్లలేదు. శ్రీహరిరావు మనసు మనసులో లేదు. ఎటో

తోచినవైపు నడక సాగించాడు. రైలుకట్ట ఎక్కి త్వరత్వరగా నడుస్తున్నాడు. అతనికి దుఃఖం పొంగి పొరలి వచ్చింది. ఒక చోట కూర్చుని కొద్ది నిముషాలసేపు ఏడ్చి మళ్ళా చొక్కా చివరలతో కళ్ళు తుడుచుకున్నాడు.

బాగా పొద్దుగూకి చల్లని గాలి మళ్ళింది. పక్షులన్నీ వరుసలు వరుసలుగా జట్లు జట్లుగా హుషారుగా ఎగురుతూ గూళ్ళకు తిరిగి పోతున్నాయి. 'వాటి కీ పరీక్షలూ లేవు .... ఫలితాలూ లేవు .... ఎంత హాయిగా ఉన్నాయి' అనిపించి దతనికి. రైలు పట్టాలమీద ఉన్న చిలుమును తినేందుకు వచ్చిందో, లేక పట్టాలు దాటే ప్రయత్నం చేసిందో ఒక పాముపిల్ల రెండు ముక్కలై పడిఉన్నది.

దూరాన రైలు వస్తున్నది. శ్రీహరి లేచి నడవ సాగాడు. రైలు కూత పెడుతూ ముందుకు దూకి వస్తున్నది. శ్రీహరి అలాగే నడుస్తున్నాడు. రైలు దగ్గరిలోకి వచ్చింది. శ్రీహరి పట్టాలు దిగి నిలబడ్డాడు. రైలు 'గుప్పు గుప్పు' మని పొగ వదులుతూ దూసుకుని ముందుకు వెళ్ళి పోయింది. శ్రీహరి మళ్ళా పట్టాలు ఎక్కి నడవడం ప్రారంభించాడు. ఆ ప్రక్క స్టేషను ఏడు మైళ్ళు .... అక్కడి నుంచి మళ్ళా పొలంగట్లమీద అడ్డదారిన పడి మైలున్నర పోతే అతని ఊరు.

ఇంటిదగ్గర అతని తల్లి సాయంకాలం నాలుగు గంటలకే వాకిట్లో నిలబడి అతనికోసం పొద్దుగూకేదాకా ఎదురు చూసింది. శ్రీహరి తోటి పిల్లలు ఎవరూ కనిపించలేదు. అది ఊరి చివరి యిల్లు కావడంవల్ల వీధి గుమ్మంలో నిలబడితే రోడ్డుమీద మలుపు తిరిగినవారు కనిపించక తప్పదు .... అలా ఆమె కళ్లలో వత్తులు పెట్టుకుని చూస్తూ ఎంతోసేపు నిలబడింది..... వీడు ఫోర్తుఫారమ్ ప్యాసైతే ఫిఫ్తుఫారంలోకి వస్తాడు. ఆతర్వాత స్కూలుఫైనల్ .... అంటే తన కష్టాలు యిక రెండు సంవత్సరాలు .... ఆ తర్వాత తన తమ్ముడు తన కిచ్చిన వాగ్దానం ప్రకారం వాడికి ఏదో ఒక ఉద్యోగం యిప్పిస్తాడు. ముందు స్కూలుఫైనలు కావాలి.

ప్రొద్దు గూకుతున్నకొద్దీ ఆమెకు ఆదుర్దా హెచ్చింది. పిల్ల లెవరూ ఆమెకు కనిపించడంలేదు. వీరయ్య నీళ్ల కావిడి మోసుకుపోతూ "ఏమమ్మా ! కుర్రాడు గట్టెక్కించాడా లేదా ?" అని అడిగాడు సాగిపోతూనే ..... "ఏదీ .... వీడింకా రాలేదయ్యా .... నాకూ ఆదుర్దాగానే ఉంది" అన్నదామె.

చిరు చీకట్లు వ్యాపిస్తూ ఉండగా రోడ్డు చివర నలుగురైదుగురు పిల్లలు కనిపించారు. ఆమె 'అమ్మయ్య' అనుకుంది. కానీ, వాళ్ళు తమ యింటి ముందుకు వచ్చేదాకా శ్రీహరి వాళ్లలో లేడని ఆమెకు తెలియలేదు .... ఆమె పెద్దగా "మా వా డేడీ ఉమాపతీ ?" అని అడిగింది. ఉమాపతి సమాధానం చెప్పలేదు. చిచ్చుబుడ్డి మాత్రం "వాడింకా యింటికి రాలేదా ? నాతో ఎవరో బంధువులను చూసి వస్తానన్నాడే .... మాతో కలవవేలేదు .... రిజల్ట్సులో వాడి నంబరు లేదు ...." అన్నాడు.

ఆమె క్రుంగిపోయింది. కళ్లలో నీటి పొర కమ్ముకురాగా గుమ్మాని కానుకుని నిలుచుండి పోయింది. తర్వాత పావుగంటసేపటికి వీరయ్య వచ్చి సంగతి కనుక్కొని చేతి కఱ్ఱ తీసుకుని వెదకటానికి బయల్దేరి పోయాడు.

రాత్రి పదకొండు గంటల దాకా ఆమె ప్రాణా లుగ్గబట్టుకుని ఆందోళనతో యింట్లోకీ, వాకిట్లోకీ పిచ్చిపట్టిన దానిలా తిరిగింది. అప్పటికి వీరయ్యా శ్రీహరీ యింటికి చేరుకున్నారు. శ్రీహరి ఆ చిన్న రైల్వే స్టేషనులో ప్రయాణికులు కూర్చునే బల్లమీద పడుకుని ఉన్నాడు.

ఆమె అతన్ని లోపలికి తీసుకువెళ్లి వంటిమీద చేయి వేసి చూస్తే వళ్లు వేడిగా ఉన్నట్టనిపించింది. అది మొదలు శ్రీహరి రావుకు వరుసగా పక్షం రోజులపాటు వళ్లు తెలియని జ్వరం .....

దానితో చదువుకు స్వస్తి చెప్పటం జరిగింది. తర్వాత అతనికి చదువుకోవాలని అనిపించలేదు. అతని తల్లి రెండు మూడుసార్లు చెప్పి చూసింది కాని అతడు మౌనంగా వూరుకోవడంవల్ల ఏం చెయ్యటానికి తోచక తన తమ్ముడికి ఉత్తరం వ్రాసింది. ఆయన వచ్చి శ్రీహరిరావుకు హితబోధ చేశాడు. "ఒకసారి తప్పగానే అంతగా నీరస పడిపోతే ఎలాగురా ? అందరూ అన్ని క్లాసులూ ఎక్కడా తప్పకుండానే పై చదువులకు వెళ్లారా ? నామాట విని మళ్ళా స్కూల్లో చేరు" అని చెప్పి చూశాడు. శ్రీహరిరావు మారు పలకలేదు. అతని మనసులో ఒకటే దృశ్యం కనిపించింది. అతన్ని నిరుత్సాహ పరుస్తున్నది. పోయిన సంవత్సరం తనతో చదువుకున్నవా రందరూ ఉమాపతీ, విశ్వనాథం, రంగడూ, సత్తి శంకరయ్యా, జిడ్డు సూర్యం, చిచ్చుబుడ్డి అందరూ ప్యాసై పై క్లాసుకు వెళ్లారు. తనొక్కడే వెనకపడిపోయాడు. తాను స్కూల్లో చేరితే మళ్లీ పాత పుస్తకాలనే సంచిలో వేసుకుని వారి వెంట బడికి పోవాలి. వాళ్ళు కొత్త క్లాసులూ, కొత్త మాస్టర్లూ, కొత్త పుస్తకాలూ గురించి ఉత్సాహంగా మాట్లాడుకుంటూ హుషారుగా ఉంటారు. తాను పాత పుస్తకాలతో, పాత చదువుతో నిరుత్సాహంగా నిలిచిపోవాలి. అది అతని కెంతో బాధాకరమైన విషయంగా తోచింది. అందువల్ల తన మేనమామ వెళ్లిన తర్వాత తల్లితో కచ్చితంగా 'చదువుకో' నని చెప్పివేశాడు. ఆమె నిట్టూర్చి ఊరుకుంది.

శ్రీహరిరావులో అప్పుడు బాగా మార్పు వచ్చింది. ఎప్పుడూ మౌనంగా ఉండేవాడు. ఈడుకు మించిన గాంభీర్యం, ఎవరితోనూ ఎక్కువగా మాట్లాడక పోవడం, నిరంతరం ఏదో ఆలోచిస్తూ ఉండటం అతని తల్లికి ఆదుర్దా కలిగించింది. అతడు చదువు మానేసిన మొదట్లో అప్పుడప్పుడు తన స్నేహితులు కొత్త కొత్త పుస్తకాలతో కొత్త క్లాసులకు ఉత్సాహంతో పోతూవుండగా చూసినప్పుడు అతనికి బాధ

గానే ఉండేది. అయినా కాలక్రమేణా దాన్ని గురించి బాధ పడటం మానివేశాడు.

అతడు రోజూ సాయంకాలంపూట ఊరికి దూరంగా నడిచిపోతూ ఉండేవాడు..... ఆ ఊరికి ఒక ప్రక్క దట్టమైన వెదురు పొదలూ, కుంకుడు చెట్లూ, జీడిమామిడి చెట్లు, సరివి తోపులూ ఉండేవి. కొన్ని కొన్నిచోట్ల పట్టపగలే చిమ్మ చీకటి వ్యాపించి ఉండేది. ప్రొద్దు గూకితే ఆ ప్రక్కల అంతా భయంకరంగా ఉండేది. పిలిస్తే ఎవరు పలికేటంత దారుణంగా చీకట్లు చిక్కగా వ్యాపించి ఉండేవి. కీచురాళ్ల చప్పుడూ, గాలి విసురుకు తల ఊపుతున్న చెట్ల 'ఝుమ్మ' నే శబ్దమూ, అక్కడక్కడ చిత్ర విచిత్రమైన పక్షుల రొదలూ, గుండెలు 'జల్లు' మనిపిస్తూ ఉండేవి. ఆ దోవనే దాదాపు రెండు మైళ్లు నడిచిపోతే సముద్రం.... అరమైలు దూరంలో ఉండగానే తెల్లని యిసుకనేల ప్రారంభం. నిరత నిశీథులలో తమ ఊరికి కూడా సముద్రపు హోరు వినిపిస్తూ ఉండేది. పోగా పోగా నీలం రంగులో ఆకాశంతో కలిసిపోతున్న సముద్రమూ, పెద్ద ఘోషతో విపరీతమైన బలంతో ఎగిరెగిరి పడుతున్న కెరటాలూ, ప్రతి కెరటానికీ వెండి కిరీటాలు పెట్టినట్టు మెరిసే నురుగూ, అస్తమిస్తున్న సూర్యుని బంగారపు చివరి కాంతులు కెరటాలకు వేసే చిత్ర విచిత్ర వర్ణాలూ, పైన ఆహ్లాదంగా ఎగురుతూ పల్లటీలు కొట్టే రకరకాల పక్షులూ, శరీరాన్ని సేదదీర్చే జీవంపోసే చల్లని గాలి .... అక్కడ అంతా మనోహరంగా ఉండేది. ఆ విశాల జలరాశి ముందు ప్రశాంతంగా కూర్చున్నప్పుడు యీలలు వేస్తూ వేగంగా వీచే గాలి ఏ దూర సీమల నుంచో చిత్ర విచిత్రమైన కథలను తీసుకువచ్చి వినిపిస్తున్నట్టుండేది. అలా కూర్చున్నంతసేపూ మనసంతా చిత్రమైన ఊహలతో నిండిపోయేది. ఈ విశాల సృష్టిలో మానవుడి దెంత అల్పస్థానం అనిపించేది.

శ్రీహరిరావు అప్పుడప్పుడు మధ్యాహ్నం పూటనే బయలుదేరి వెళ్లి సముద్రతీరంలో గడిపి ప్రొద్దు గూకుతూ ఉండగా తిరుగుముఖం పడుతూ ఉండేవాడు. ఎక్కడికీ కదలనప్పుడు పగలంతా ఎవరెవరినో అడిగి తెచ్చుకున్న పుస్తకాలు చదువుతూ ఉండటమూ, సాయంకాలంపూట చెరువుగట్టుకు వెళ్లి చీకటి పడేవరకూ కూర్చుని రావడమూ, కూనిరాగాలు తీస్తూ ఉండటమూగా ఉండేది అతని పని.

ఒకనా డతడు చెరువుగట్టున కూర్చునిఉండి ఏమీ తోచక చిన్నచిన్న రాళ్లు ఏరి దూరంగా విసురుతున్నాడు. పొద్దుగూకేందుకు బహుశా ఎంతోసేపు పట్టదేమో ! సూర్యుడప్పుడే కమ్మరి కొలిమిలో ఎర్రగా కాల్చబడిన పాషాణపు బంతి వలె క్రిందికి దిగిపోతున్నాడు. చెరువు గట్టున ఉన్న పెద్ద మర్రిచెట్టు దట్టమైన శాఖలలోని గూళ్లలో ఉండి పక్షిపిల్లలు రొద చేస్తున్నాయి. ఇప్పుడే చలిగాలి వీస్తున్నది. మరి కాసేపు ఉంటే చలి పెద్ద పులిలా క్రూరంగా తన పాలన ప్రారంభిస్తుంది. కొంపా, గోడూ లేని దీనులు, అనాథులూ ఆ దుర్మార్గపు పాలనను భరించలేకనూ, భరించక చేసేది లేకనూ పళ్లు పటపట లాడిస్తూ క్రుంగిపోతారు.

ఇంతలో వెనుక నుంచి ఎవరో అతన్ని పిలిచినట్టయింది. అతడు వెనుదిరిగి చూశాడు. ఒక నల్లని నడి వయసు మనిషి ఏదో పేరు చెప్పి 'వారి యిల్లెక్కడ ?' అని అడుగుతున్నాడు. అత డడుగుతున్నది కరణంగారి యిల్లు. అతని వెనుక ఒక అమ్మాయి నిలబడి ఉంది. ఆమె శ్రీహరి రావు వంక సమాధానం కోసం ఉత్కంఠతో చూస్తున్నది.

శ్రీహరిరావు వారిని తనతో రమ్మని కరణంగారి యిల్లు చూపించాడు. వా రిద్దరూ ఆ యింట్లోకి వెళ్లిపోయిన తర్వాత తన యింటివైపు నడవడం ప్రారంభించాడు.

అతని మనసులో యిప్పుడా పిల్ల కళ్లు మెదులుతున్నాయి. అతడు అంతవర కెన్నడూ అంత అందమైన అమ్మాయిని చూడలేదు. అస్తమిస్తున్న సూర్యుణ్ణి అరుణకాంతులలో నిలువెత్తు శిల్పంవలె నిలబడి ఉండి ఆమె తన వంకకు చూస్తున్న దృశ్యం గుర్తుకు వచ్చింది. ఆమె అందమంతా ఒక ఎత్తు. ఆ కళ్ల అందం మరొక ఎత్తు. ఆ కళ్లు స్వచ్ఛనీరములతో నిండిన కాసారాలవలె, నిర్మేఘమైన శరత్కాలపు ఆకాశ ఖండాలవలె కాంతు లీనుతున్నాయి. ఆమె అవయవ సౌష్ఠవం సరేసరి. అద్భుతమైన పుట్టుక. సృష్టికర్త, తన పని చూస్తూ ప్రక్కన నిలబడిన అర్ధాంగికి అసూయ కలిగించే నిమిత్తం తన సర్వ శక్తులూ వెచ్చించి యీ సౌందర్యరాశిని సృష్టించాడేమో !

మరునాడు శ్రీహరిరావు భోజనం చేస్తూఉండగా తల్లి ఎదుటనే కూర్చుని అవీ ఇవీ మాట్లాడుతూన్నది. ఆ మాటలలోనే కరణంగారి యింటికి వచ్చిన కొత్త మనుష్యుల ప్రసక్తి కూడా వచ్చింది. శ్రీహరిరావు అంతవరకూ అన్యాసక్తంగా వింటున్నవాడల్లా ఆ విషయాన్ని మాత్రం శ్రద్ధగా విన్నాడు. కరణంగారి కొక తమ్ము డున్నాడు. ఆయన కొక్క కూతురే సంతానం .... ఆ పిల్లపేరు వైదేహి .... తల్లి ఆ పిల్ల చిన్నతనంలోనే పోయింది. అప్పటినుంచి ఆమె తండ్రి వైరాగ్యం పొంది మళ్లా యీ సంసార జంజాటంలో పడదలుచుకోలేదు. ఆపిల్ల పోషణ చూస్తూ అలాగే కాలం గడిపాడు. ఆమెకు పధ్నాలుగు సంవత్సరాలు వచ్చాయి. ఇంతలో ఆయన హఠాత్తుగా ఏదో విషజ్వరంవల్ల కన్ను మూశాడు .... ఆపిల్ల దిక్కులేనిదైపోయింది. .... పెదతండ్రి వెళ్లి అన్ని పనులూ పూర్తిచేసి ఆమెను యిక్కడికి తీసుకువచ్చాడు. శ్రీహరిరావుకు అనుమానం కలిగింది. 'నిన్న పాలేరును కాబోలు వెంటబెట్టుకుని ఒక అమ్మాయి—ఆమే కాబోలు—కరణంగారి యింటికోసం అడిగించింది. నేను చూపించాను. అప్పుడు ఆయన వెంట లేడే' అన్నాడు. అతని తల్లి "ఏదో పని ఉండి వెనక ఎక్కడో ఆగిపోయి ఉంటాడు. ఎలాగూ పాలేరు తోడున్నాడు కదా అని వారిని యింటికి వెళ్లమని పంపించా

డేమో' అన్నది. తర్వాత ఆమె తన యింటిని గురించీ, తన పరిస్థితులను గురించీ మామూలు పాట మొదలుపెట్టింది.

శ్రీహరిరావు తర్వాత ఒకనాటి సాయంకాలం సముద్ర తీరాన కూర్చుని ఉన్నాడు. ఇప్పు డతని ఆలోచనలన్నీ 'వైదేహి'ని గురించినవే .... "ఎంత చక్కని పేరు' అనుకున్నాడు ముందుగా. తర్వాత అతని మనఃఫలకంమీద మళ్లీ అదే దృశ్యం .... చిత్రంగా నిలబడి సమాధానం కోసం ఉత్కంఠతో తనవంక చూస్తున్నది ఆమె .... అస్తమిస్తున్న సూర్యుని బంగారు కిరణాలు అసలే కుందనపు బొమ్మవంటి ఆమె శరీరానికి మరింత శోభ నిస్తున్నాయి. చిలిపిగాలులు ఆమె ముంగురులతో చెలగాట మాడుతూవుండగా బంగారపు పుల్లలవంటి సన్నని వ్రేళ్లతో వాటిని పైకి తోస్తున్నది.... చెంపలకు చేరెడేసి ఉన్న ఆ నల్లని తళతళలాడే కన్నులతో పోల్చదగినవి సృష్టిలో ఏమున్నాయి ?

శ్రీహరిరావు తనకు తెలియకుండానే ఆమెను గురించి ఆలోచిస్తున్నాడు. అతని మనస్సులోకి మరేదీ రావడంలేదు. తా నామెను ప్రేమిస్తున్నాడా ? ఏమో ! కాని .... ఆమెను మళ్లీ చూడాలని, ఆమెను గురించే ఆలోచించాలనీ అనిపిస్తున్నది. ఆమెను గురించి ఆలోచిస్తూ అలా ఎంతసేపు కూర్చున్నాడో అతనికే తెలియదు..... ఒక చిలిపి కెరటం ఉవ్వెత్తున లేచి వచ్చి అతని పాదాలను తడిపి పోయింది. దానితో అతడీ ప్రపంచంలోకి వచ్చి చూస్తే అప్పుడే ఉదయించి పైకి వస్తున్న చంద్రబింబపు స్వచ్ఛ కాంతులలో ఒకవైపు సముద్రభాగమంతా కరిగించిపోసిన వెండివలె మిలమిల మెరుస్తున్నది. సూర్యాస్తమయం ఎప్పు డయిందో, చంద్రోదయం ఎప్పు డయిందో, అతనికి తెలియలేదు. అత డింత సేపు ఏవేవో కలలు కంటూ మరొక ప్రపంచంలో ఉన్నాడు. అప్పటికే పొద్దు పోయింది.. చాలా దూరం నడిచిపోవాలి. పైగా అతడు ఇంటినుంచి మధ్యాహ్నమే బయలుదేరి వచ్చాడు. ఇంటిదగ్గర అతని తల్లి ఎంత ఆరాటపడుతున్నదో !

అతడు విసురుగా నడిచి ఇల్లు చేరుకునేసరికి ఊరు మాటుమణిగిఉంది. బాగా పొద్దుపోయినందువల్ల వీథులన్నీ నిర్మానుష్యంగా ఉన్నాయి. ఉండీ, ఉడిగీ ఎక్కడో ఏవకి చేస్తున్న చప్పుడో, ఏ యింట్లో ఏ పసివాడు ఏడ్చిన శబ్దమో వినబడుతున్నది.

అతడు గుమ్మంలో అడుగు పెడుతూనే పంచలో చలిగాలికి రెపరెపలాడుతున్న బుడ్డిదీపం పక్కన కూర్చునివున్న తల్లిని చూశాడు. ఆమె కొంగు చెవుల చుట్టూ కప్పుకుని పరధ్యానంగా కూర్చునివుంది. ఆమె ప్రక్కనే దీపపు వెలుగులో మట్టి నేలమీద ఒక కార్డు ఉంది. లోపలికి వస్తున్న కొడుకును చూడగానే ఆమె గద్గదస్వరంతో "ఇంత పొద్దు పోయేవరకూ ఎక్కడ ఉన్నావురా ? ఇంటిదగ్గర ఒక్కదాన్నీ ఉంటానన్న ఆలోచనైనా లేదా నీకు?'' అన్నది. ఆమె యింత వరకూ కనీసం అమాత్రపు ప్రశ్న కూడా ఎన్నడూ అడగలేదు. అతడు నివ్వెరపోయి అంతలో సర్దుకుని "సముద్రం వైపు వెళ్లానమ్మా ! అక్కడ కూర్చుంటే కాలం గడిచి పోతున్నదే తెలియలేదు. పొరపాటయిపోయింది'' అన్నాడు. ఆమె ఆర్ద్రమైన స్వరంతో నెమ్మదిగా "ఇవాళ అక్కయ్య ఉత్తరం వ్రాయించింది. నీకు తెలుసుగా ! ఆ కొంపలో దానికి ఉత్తరం కొనియిచ్చి వ్రాసిపెట్టేవాళ్లు కూడా ఎవరూ లేరు. మరి..... ఎవరిచేత వ్రాయించిందో పిచ్చితల్లి .... ఉత్తరం చదువుతూ ఉంటే కడుపు తరుక్కుపోతున్నది. అయినా నా కన్నీ బాధ కలిగించేవిగానే ఉన్నాయి. అటు చూస్తే దాని కాపురం అలా ఉంది .... ఇటు చూస్తే నువ్వేమో చదువు మానేసి యిల్లూ వాకిలీ పట్టకుండా తిరుగుతున్నావు .... ఇల్లు గడవటం కష్టమై పోతున్నది .... అయినా నువ్వు యీ విషయాలేవీ పట్టించుకోకపోతే ఎలాగురా ? నేను ఒక్కతెను ఎంతకాలమని ఇలా వేగగలను ?'' అన్నది.

శ్రీహరిరావు మనస్సు చివుక్కుమన్నది. నిజమే .... వయసుకు చిన్నవాడే అయినా ఇంటికైన పెద్దవాడు తాను. తన చిన్న యీడు చూసే తల్లి తనతో ఎన్నడూ యిలా మాట్లాడలేదనే విషయం గ్రహించేందుకు అతనికి ఎంతో సేపు పట్టలేదు. అలా చెప్పించుకోవలసి వచ్చినందుకు అతడు సిగ్గుతో తల వంచుకున్నాడు.

అతని దృష్టి ఉత్తరం మీదికి మళ్లింది. దాన్ని చేతుల్లోకి తీసుకుని దీపం వత్తి పెద్దది చేసి చదివాడు. ఎవరో పిల్లవాడు వ్రాసిన వ్రాతలా ఉంది. అక్షరాలన్నీ తప్పులు, కూడబలుక్కుంటూ చదువవలసి వచ్చింది. తీరా చూస్తే అందులో ఆమె పడుతున్న బాధలేవీ లేవు. ఉత్తరంలో కేవలం కొద్ది వాక్యాలు మాత్రమే ఉన్నాయి ! 'తమ దగ్గిర నుంచి కొన్ని నెలలుగా ఉత్తరం రాలే' దనీ, 'కారణం తెలియద' నీ తమ్ముడు బాగా చదువుకుంటున్నాడా ?' అనీ, వ్రాయించిందామె. 'తనకు అత్తవారి యింటి దగ్గర బాగానే ఉన్నద' ని కూడా చివరలో ఉంది. శ్రీహరిరావు తలఎత్తి 'అక్కడ తనకు బాగానే ఉన్నదని వ్రాసిందే' అన్నాడు. అతని తల్లి కళ్లు తుడుచుకుని 'కాకపోతే తను పడుతున్న బాధలన్నీ వ్రాయిస్తుందనుకున్నావా ? మన మెక్కడ దిగులుపడిపోతామో నని అలా వ్రాయించింది. అక్కడి అసలు సమాచారం నాకు తెలియదూ ? బంగారు తల్లిని అనవసరంగా ఆ యమకూపంలో పడేశాము'' అన్నది.

శ్రీహరిరావుకు ఆ రాత్రి అంతా ముందు గదిలో కిటికీ ప్రక్కన మంచంలో పడుకుని భవిష్యత్తును గురించి ఆలోచించటంతో సరిపోయింది. అయినా అర్ధరాత్రి దాటి అతనికి నిద్ర ముంచుకుని వచ్చే వేళకు కూడా అతని ఆలోచనలు తెగలేదు.

తర్వాత రెండు రోజులకు అతడొక నిర్ణయానికి వచ్చి తల్లి నడిగి అయిదు రూపాయలు తీసుకుని, ఆమె అనుజ కూడా తీసుకుని తన మేనమామగారి ఊరికి వెళ్లాడు. ఆయన హఠాత్తుగా వూడిపడిన శ్రీహరిరావును చూసి "ఇలా వచ్చా

వేంరా శ్రీహరీ! అమ్మ కులాసాగా ఉందా?" అని అడిగాడు. శ్రీహరి తల వూపుతూ 'ఆఁ' అంటూఉండగా తేరుకుని కూతుర్ని కేకవేసి "దుర్గా! బావ వచ్చారు. కాళ్లు కడుక్కునేందుకు నీళ్లు తీసుకురా!" అన్నాడు. దుర్గ ఆయన కొక్కతే కూతురు. ఆపిల్లకు పదమూడేళ్లు దాటుతున్నాయి. చామనచాయలో బక్కపలుచగా ఉంటుంది. ఆమె చెంబుతో నీళ్లు తీసుకువచ్చి గుమ్మంలో ఉంచింది. శ్రీహరిరావు ఆ పిల్లను అప్పుడప్పుడు తప్ప ఎన్నడూ కలుసుకోలేదు. అందువల్ల వారిమధ్య పరిచయం వంటిది లేదనే చెప్పాలి. కాకపోతే తన కొక బావ ఉన్నాడనీ, ఫోర్తుఫారం తప్పి కూర్చున్నాడనీ, అతడేమాత్రపు సంపాదనపరుడైనా తన తండ్రి గంతేసి తనను అతనికిచ్చి పెళ్లి జరిపిస్తాడనీ, పరాయి సంబంధాల కోసం వెదకటం ఆయునకు చిరాకనీ, దుర్గకు తెలుసు.

ఆపిల్లకు మొదటినుంచీ భోగభాగ్యాలమీద మనసు .... వాళ్లు అంతగా కలిగినవారేమీ కాదు. ఏదో లోటు లేకుండా జరిగిపోవటం తప్ప ఆ కుటుంబంలో ఆడంబరాలు ఏమాత్రమూ లేవు. ఆమె తల్లి ఒక మెత్తని యిల్లాలు. ఎన్నడూ ఆమెకు జత చీరలకు మించి ఉండేవికావు. చిరుగులు పట్టినా ఓపికగా కుట్టుకుంటూ బాగుచేసుకుంటూ వాటితోనే కాలక్షేపం చేసేది. భర్తగాని, మరెవరయినాగాని గమనించి 'అయ్యో!' అనుకుని ఆమె అవసరాలు తీర్చవలసిందే తప్ప ఆమె కవి తోచవు. అటువంటి తల్లి కడుపున పుట్టిన దుర్గకు చిత్రమైన నడవడి అబ్బింది. ఆమెకు మొదటినుంచి స్నేహితురాళ్లంతా బాగా కలవారి పిల్లలు. వారిలో కొందరికి కార్లు కూడా ఉండేవి. ఆమె సావాసకత్తె లందరూ ఎల్లప్పుడూ ఖరీదైన దుస్తులతో, ముఖాలకు ఖరీదైన పౌడర్లూ, స్నోలతో, కాళ్లకు ఖరీదైన చెప్పులతో, చేతులలో సువాసనలు విరజిమ్మే ఖరీదైన జేబురుమాళ్లతో నిరంతరం ఆడంబరంగా ఉండేవారు. వాళ్ల యిళ్లలో రేడియోలు, సోఫాలు, పంకాలు, అద్దాల బీరువాలు .... అంతా నయనానందకరంగా ఉండేది. తనది కేవలం మధ్య తరగతి సంసారమని దుర్గకు తెలుసు. అయినా మొదటి నుంచీ ఆమెకు అటువంటి యిళ్లలో జీవితం సుఖంగా గడపాలనీ, ఆడంబరాల మధ్య దర్జాగా, ఠీవిగా కాలం వెళ్లబుచ్చాలనీ ఉండేది. అటువంటి ఆలోచనలున్నందువల్ల ఆమెకు తన బావను తలుచుకుంటే ఏమిటోగా ఉండేది .... తనకు తెలిసినంతవరకూ అతని ప్రకృతి మృదువైనది కాదు. ఆ నిర్ణయాని కామె చాలినంత ఉపపత్తితోనే వచ్చింది.

శ్రీహరిరావు వచ్చిన మూడో రోజున ఎక్కడో ఎవరో దక్షిణాది సంగీత విద్వాంసుడు కచేరీ చేస్తున్నాడనీ విని వెళ్లి, రాత్రి పది గంటలవేళ చలిలో, భోరున కురిసే వానలో నిలువెల్లా తడిసి యింటికి వచ్చాడు. అతని మామా, అత్తా యిద్దరూ కొంచెం కంగారు పడ్డారు. ఒకరు తల తుడుచుకునేందుకు తుండూ, మరొకరు అతని సంచిలో నుంచి పొడి గుడ్డలూ అందించారు. అతని మామ "పోనీ .... వానరోజులు కదా! వెళ్లేటప్పుడు గొడుగు తీసుకుపోక పోయావా?' అన్నాడు.

మధ్య గదిలో మంచంలో వెచ్చగా పడుకుని దుప్పటి మడతల మధ్య కలలు కంటున్న దుర్గ మనసులో "ఒట్టి అనాగరికపు మనిషి" అనుకున్నది.

అన్నట్టు యిప్పటికి మాత్రం ఆమె తత్వం మారిందా? ఏమీ లేదు. .... లేశమాత్రం కూడా మారలేదు. .... ఆమె అలాగే ఉంది. తరువాతి జీవితంలో కూడా ఆమె అతని అభిరుచుల నన్నిటినీ అసహ్యించుకోవడం అలవాటు చేసుకుంది. అతనికి కాకరకాయ కూర అంటే పంచప్రాణాలూ .... ఆమె ఆ పేరు వినగానే మొహం చిట్లించి అసహ్యం నటించి "ఛీ! చేదు విషం" అనేది. అతడే లొంగిపోయి తన ఒక్కడికోసం యింట్లో మిగిలినవా రందరూ బాధపడటం ఎందుకులెమ్మని ఆ కూర పేరు ఎత్తటమే మానివేశాడు .... ఆమెకు సంగీతమంటే ద్వేషం లేదు. గాని, శ్రీహరిరావుకున్న సంగీతాభిమానంవల్ల ఆమె దాన్ని ద్వేషించటం నేర్చుకుంది .... అతడెప్పుడైనా కులాసాగా సంగీతం విషయం మాట్లాడితే "పోనిద్దురూ! వెధవ సంగీతం" అని ఊరుకునేది. ఏనాడైనా మంచి సంగీత కచేరీకి వెళ్లి పొద్దుపోయి యింటికి వచ్చిన తర్వాత నాలుగు మెతుకులు తిని పడుకోబోతూ ఏదో జ్ఞాపకం చేసుకుని హుషారుగా "లేపకే నా యేంకి లేపకే నిదురా ఈపాటి సుఖమూ నే నింతవర కెరుగనే .... లేపకే ...." అని గొంతెత్తగానే "పొద్దుపోయింది. 'అర్ధరాత్రిపూట అంకమ్మ శివాల' న్నట్టు యిప్పుడు పాట లేమిటి? పడుకోక .... పిల్లలు లేస్తారు ...." అనేది. ఆ మాటతో శ్రీహరిరావు మనస్సు గాయపడిపోయేది. అతని ఉత్సాహమంతా నీరుకారిపోయేది .... అయినా లొంగిపోవటం ఒక్కటే తనకు చేతనైంది. తన జీవితమే అంత మొదటి నుంచీ .. అటువంటి మాటలు విన్నప్పుడు బాధతో మరొక వైపుకు తిరిగి పడుకునేవాడు.

తర్వాత రెండు మూడు రోజులకు శ్రీహరిరావు తన మేనమామ యింటికి వచ్చిన పని అయింది. ఆ వూళ్లో పేరుపొందిన ఒక పెద్ద లాయరును ఆశ్రయించా డతడు. ఆయన మధ్య వయస్కుడు. మెత్తని మనసు కలవాడు. కల్పవృక్షం వంటి ప్రాక్టీసు కలవాడు. శ్రీహరిరావు గోడు అంతా విని తల ఎత్తి చూసి 'నువ్వు చదువెందుకు మానేశావు?' అని ప్రశ్నించాడు. శ్రీహరిరావు తన బాధలన్నీ చెప్పుకున్నాడు. వెనకరాబడి ఏమీ లేనందువల్లనూ, జరుగుబాటు కష్టం కావడం వల్లనూ అతడు చదువు మానేయవలసి వచ్చిందని లాయరు గారికి అర్థమైంది. కాస్సేపాగి "సరే .... మీవా రెవరో యీ వూళ్లో ఉంటున్నా రన్నావుగా! మీ అమ్మను తీసుకు వచ్చి యిక్కడ స్థిరపడు. నేను ఏదో ఏర్పాటు చేస్తానులే" అన్నాడు. తర్వాత అతడు అక్కడి గుమాస్తాను కలుసుకుని మాట్లాడితే అంతా అర్థమైంది. ఉదయం నుంచీ, సాయంకాలం దాకా అక్కడి రకరకాల డాక్యుమెంట్లకు కాపీలు

తీయటం తన పని. అందుకు అతనికి నెలకు ముప్ఫై అయిదు రూపాయలదాకా జీతం ఉంటుంది.

ఆమాత్రపు దానికే శ్రీహరిరావుకు కొండెక్కినంత సంతోషం కలిగింది. తన కాళ్లమీద తాను నిలబడి తల్లిని కష్టపెట్టకుండా గడపగలిగే రోజులు వచ్చాయని అతడు సంతోషించాడు. ఆ భావమే అతనికి ఎంతో సంతృప్తి కలిగించింది. అతడు మేనమామకూ, అత్తగారికీ యీ విషయం చెప్పాడు. వారు యీ వార్త విని పొంగిపోయారని చెప్పేందుకు వీలులేదు. కాని, కాకపోతే మేనమామ మాత్రం "ఏదో ఫర్వాలేదు. అక్కడ ఉండి సోమరిగా కూర్చోవటం కంటే ఇది నయం కదూ ? ఇదైనా మంచిదే. ఇలా గడుపుకుంటూ ఇతరచోట్ల ప్రయత్నించి మంచి దేదైనా దొరికితే స్థిరపడ వచ్చు" అనుకున్నాడు. దుర్గ మాత్రం "దస్తావేజులకు కాపీలు వ్రాయటం ఉద్యోగ మనిపించుకుంటుందా ? కూలీ అనిపించుకుంటుంది. ఉద్యోగమంటే సరళ అన్నగారు చేసేది. ఆయనకు నెలకు ఎనిమిది వందలు జీతంట .... ఆయన వెంట ఎల్లప్పుడూ నౌకర్లు ఉంటారు. ఎప్పుడూ కారులో తప్ప క్రింద కాలు పెట్టడు. ఆయన కాల్చే సిగరెట్లు ఇంగ్లండులో తయారవుతాయని సరళ చెప్పింది. అవీ ఉద్యోగాలంటే" అనుకున్నది.

శ్రీహరిరావు తన సంచీ తీసుకుని బయలుదేరి "మంచి రోజు చూసుకుని అమ్మను తీసుకు వచ్చేస్తాను. అన్నట్టు ఆ పక్క యింట్లో రెండు గదుల భాగమూ అద్దెకు మాట్లాడి ఉంచండి. నెలకు ఆరు రూపాయల అద్దె ఎక్కువే. అయిదు రూపాయలైతే తాళం తీసుకుని ఉంచండి.... " అని చెప్పి వెళ్లిపోయాడు. దుర్గ లోపలి గుమ్మాన్ని కానుకుని చూస్తూ నిలబడిపోయింది .... ఆమె తల్లి "పిల్లవాడు బుద్ధిమంతుడే" అని అనడమూ, తండ్రి అంగీకరిస్తూ తల ఊపడమూ దుర్గ కేమాత్రమూ నచ్చలేదు.

శ్రీహరిరావు రైలుదిగి హుషారుగా కూనిరాగం తీస్తూ పొలంగట్ల వెంట నడిచి యిల్లు చేరుకున్నాడు .... అప్పటికి వెన్నెల మనోహరంగా వ్యాపిస్తున్నది. ఆకాశంలో పలుచని జలతారు మబ్బులు వయ్యారంగా తేలిపోతున్నాయి. ఊరి మధ్య ఉన్న వేణుగోపాలస్వామి ఆలయం నుంచి గంటలు వినబడుతున్నాయి. ఎక్కడనుంచో మనోహరమైన సన్నాయి వాద్యం మెల్లగా వీస్తున్న గాలిలో తేలుతూ మంద మందంగా వినిపిస్తున్నది.

అతని పిలుపు కర్ణపుటాలకు సోకగానే అతని తల్లి ఆనందంతో ఉరుకులు పరుగులుగా వెళ్లి తలుపు తీసింది. అతడు లోపల అడుగు పెడుతూనే హడావిడిగా "అమ్మా ! మంచిరోజు చూడు .... సామాన్లన్నీ సర్దేయ్ .... మనం వెళ్లిపోతున్నాం .... " అన్నాడు. ఆమె కళ్లలో నీళ్లు ఉబుకుతున్నాయి. నెమ్మదిగా అడిగి సంగతులన్నీ తెలుసుకుని ఆమె సంతృప్తి జెందింది. 'అదేమీ పెద్ద ఉద్యోగం కాకపోయినా తమ కది చాలు .... తమ కాళ్లమీద తాము నిలబడి ఏలోటూ లేకుండా యిలా జరిగిపోతే చాలు. అంతకన్నా ఇంకేం కావాలి?' అనుకున్న దామె.

అతడు భోజనం చేస్తూ కూడా ఏవేవో కబుర్లు చెప్పాడు. ఆమె అన్నిటినీ సంతోషంతో విన్నది. ఆమెకు కొడుకును చూస్తూవుంటే ఒకవిధంగా అప్పుడు గర్వం కలిగింది.

అతడు వాగివాగి యిక మాట్లాడేందుకు ఏమీ లేక మెదలకుండా మజ్జిగ అన్నం కలుపుకుంటున్నాడు. ఇంతలో గాలి విసురుకు సన్నాయి వాద్యం మెత్త మెత్తగా హాయిగా వినిపించగా 'ఎక్కడినుంచి ?' అన్నట్టు అతడు తల్లి ముఖంలోకి చూశాడు. ఆమె "ఆనాడు కరణంగారి యింటికి రాలేదూ ? నువ్వు యిల్లు చూపించిన అమ్మాయి. ఆ పిల్లకు నిక్షేపంలాంటి సంబంధం కుదిరింది. ఇవాళే పెళ్లికూతుర్ని చేశారు. ఈ రాత్రి బండికే పెళ్లివారు తరలివస్తారు. రైలు దగ్గరికి పాతిక బండ్లు వెళ్లినయ్" అన్నది. తర్వాత ఒక్క క్షణం ఆగి "మనమూ చేశాం పిల్ల పెళ్లి .... ఏం లాభం ? పువ్వులాంటి పిల్లను ఆ కుంపట్లో పడేశాము .... ఏమిటో" అన్నది.

శ్రీహరిరావు మౌనంగా విన్నాడు. మజ్జిగ అన్నం పూర్తిగా తినకుండానే చెయ్యి కడుక్కొని లేచి పోబోయాడు. తల్లి నివ్వెరపోయి "అదేమిట్రా ? అన్నం వదిలేశావేం ?" అని అడిగితే "కడుపు నిండిందమ్మా. ఇక సయించదు" అని చెప్పి ముందు గదిలోకి వెళ్లిపోయాడు.

వాకిట్లో గాలి బిగించింది. ఎక్కడా ఆకయినా కదలటంలేదు. ఆకాశంలో చంద్రబింబం ఏ మబ్బుచాటున చిక్కబడి పోయిందో, ఉక్కపోస్తున్నది. అంటే కొద్ది సేపట్లోనే కుంభవృష్టిగా వర్షం కురువబోతున్నదన్నమాట.

శ్రీహరిరావు వరండా చివర నిశ్చలంగా నిలబడి ఉన్నాడు. ఆ యింటిముందు నుంచి వరుసగా బండ్లు—బహుశా పెళ్లివారివి కాబోలు—కదిలిపోతున్నాయి. ఆ వీథి చివరి వరకూ ఎద్దుల మెడలలోని మువ్వల గలగల ధ్వని వినిపిస్తూనే ఉంది. ఆకాశం సిరా పులిమిన కాయితంవలె నల్లని మబ్బులతో నిండిఉంది. విరబూచిఉన్న పారిజాతాన్ని దులిపినట్టు ఏ చిన్నగాలి విసురుకో వర్షం ప్రారంభం కావచ్చు. సన్నాయి నొక్కులు ఉండి ఉండి వినబడుతూనే ఉన్నాయి.

చల్లని గాలి మళ్లింది. వరండా చివర నిలబడిఉన్న శ్రీహరిరావుమీద పెద్ద పెద్ద వర్షపు చినుకులు పడ్డాయి. అలా చూస్తూ ఉండగానే కొద్ది క్షణాలలోనే తన నెవరో తరుముకుని వచ్చినట్టు వర్షం రొదచేస్తూ కురవటం ప్రారంభించింది.

శ్రీహరిరావు తల్లి గుమ్మంలోకి వచ్చి "అలా జల్లులో నిలబడ్డా వెందుకురా ?" అన్నది. అత డామె మాట విని

యివతలికి వచ్చాడు. చేతిలో దీపం వెలుగులో అతని మ్లాన వదనాన్ని చూసి తల్లి ఆత్రుతగా "ఏమిట్రా ? అలా ఉన్నావేం ?" అని అడిగింది. ఆ ప్రశ్నతో అతడు యీ ప్రపంచంలోకి వచ్చి "ఆఁ! ఏం లేదులే" అన్నాడు.

ఆ రాత్రి అంతా అతనికి నిద్ర పట్టలేదు. ఏవేవో ఆలోచనలతో మనస్సు వికలం అయిపోయింది. పచ్చని నుదుట పడుతున్న ముంగురులను బంగారపు పుల్లలవంటి సన్నని వ్రేళ్లతో పైకి తోసుకుంటూ తనవంక చూస్తున్నట్టు చెక్కిన అమరశిల్పంవలె ఆ అమ్మాయి గుర్తుకు వస్తున్నది. అతడామెను ఎందుకో అభిమానించాడు. ఆమెను గురించి ప్రశాంత సాంధ్యవేళలలోనూ, నిద్రపట్టని వెన్నెల రాత్రులలోనూ ఎంతగానో ఆలోచించాడు. ఎన్నెన్నో కమ్మని కలలు కన్నాడు .... కాని తెల్లవారితే అంటే మరికొన్ని గంటలలో ఆమెకు పెళ్లి జరిగిపోతున్నది..... ఆమె పరాయిదై పోతున్నది .... ఈ రాత్రి ఎప్పటికీ తెల్లవారకుండా యిలాగే ఉండిపోతే ! .... అతడు తన పిచ్చి ఆలోచనలకు నవ్వుకున్నాడు. ఆమె తనను గురించి యిలా ఆలోచించదు. బహుశా తనను మరిచిపోయి ఉంటుంది కూడా. తాము మళ్లీ కలుసుకున్న దెప్పుడు ? తెలియనప్పుడు యిల్లు చూపించినంత మాత్రంలో ఆమె తనను ఆజన్మాంతమూ గుర్తుపెట్టుకుంటుం దనుకోవడం వెర్రి కదూ ? మరి తాను ఆమెను గురించి యింతగా ఆలోచించడానికి కారణం ఏమిటి ? ఏమో ! అతని కదే అర్థం కావడం లేదు. అయినా యిప్పుడు ఆమెను గురించి ఆలోచించడం పాపం కూడా .... అనుకుని కళ్లు గట్టిగా మూసుకుని నిద్ర పట్టించుకునే ప్రయత్నం చేశాడు.

అతనికి మెలకువ వచ్చి కళ్లు విప్పేసరికి యింకా చీకట్లు బాగా విడిపోలేదు. అప్పుడే పెళ్లివారి యింట్లో నుంచి మంగళ వాద్యాలు వినవస్తున్నాయి. అతడు లేచి కాలకృత్యాలు తీర్చుకుని పంచలో కూర్చుని ఉండగా వారి యింటికి పట్టు చీరెల రెపరెపలతో నలుగురు ముత్తయిదువులు పెళ్లిపిలుపుతో వచ్చారు. గుమ్మానికి కుంకుమ పెట్టి 'తప్పకుండా' రమ్మని మరీ మరీ చెప్పి వారు వెళ్లిపోయారు.

బాగా ఎండ వచ్చింది. శ్రీహరిరావు తల్లి పంచలోకి వచ్చి "ముహూర్తంవేళ అయింది. నువ్వెళ్లిరా శ్రీహరీ ! మరీ మరీ చెప్పి వెళ్లారు. వెళ్లకపోతే బాగుండదు .... " అన్నది. శ్రీహరిరావు ముందు తల అడ్డంగా ఊపాడు. కాని తర్వాత ఎందుకో మనస్సు మార్చుకుని "అలాగే" అని సమాధానం చెప్పి పంచె కట్టుకుని చొక్కా తొడుక్కుని భుజాన కండువాతో బయలుదేరాడు. అతడలా గుమ్మం దాటుతూ ఉండగా తల్లి ఎందుకో ఉన్నట్టుండి "దుర్గ నీతో చనువుగా మాట్లాడిందిటరా ?" అని అడిగింది. అతడు వెనుదిరిగి తల్లి ముఖంలోని చిరునవ్వు చూసి ముందు నెవ్వెరపోయి తర్వాత తల ఊపి బయటికి వెళ్లిపోయాడు.

అతడు వెళ్లేసరికి మంగళసూత్రధారణ జరుగుతున్నది. అందరితోబాటు అతని చేతిలోను అక్షతలు ఉంచారు. అందరితోపాటు అతడూ వాటిని వధూవరులమీద చల్లాడు. అతడు నుంచొనివున్న చోటికి వధువు మాత్రమే ఎదురుగా కనిపిస్తున్నది. అతడు పెళ్లికొడుకును చూడలేకపోయాడు. అతనికి చూడాలనీ అనిపించలేదు. పెళ్లికూతురు తల వంచుకుని ఉంది. పలుచని మధుపర్కాలతో అక్షతలూ, పసుపూ పడిన నల్లని కేశబంధంతో ఆమె ఒక బంగారు శిల్పంవలె వెలుగులను చిమ్ముతూనే ఉన్నది.

శ్రీహరిరావు ఎందుకో నిట్టూర్చాడు. తర్వాత యిక వెళ్లిపోదామని వెనుదిరగగానే కరణంగారు ఎటో హడావిడిగా పోతున్నవాడు, ఆగి "ఎవరూ ! శ్రీహరేనా ?" అంటూ దగ్గరగా వచ్చి "గుర్తుపట్టలేక పోయానురా ! ఎలా ఉంది మీ అమ్మ ?" అని అడిగాడు. శ్రీహరిరావు బాగానే ఉన్నామండీ .... కొద్ది రోజులలో మా మేనమామగారి ఊరు పోదామనుకుంటున్నాము. అక్కడ నాకు పని దొరికింది...." అని చెప్పాడు.

ఆయన "అలాగా ? పోన్లే నాయనా ! ఏదో కష్టాల పాలై ఆమాత్రం నిలదొక్కుకున్నారు. అంతకూ మీ అమ్మ మంచితనమూ, ఓర్పూ కారణ మనుకో .... మహా యోగ్యురాలు .... నువ్వూ ఒక యింటివాడివైతే ఆమెకు అంతకుమించి కావలసిందేమి ఉంది ? .... అయినా మీ మేనమామ కూతురు ఉందిగా .... బయటికి పోనక్కర్లేదు. పోదామనుకున్నా మీ మామ ఊరుకోడు..... అన్నట్టు ఏదో పనిమీద వెడుతూ నీతో మాట్లాడుతూ ఉండిపోయాను. ఉండు నాయనా ? భోజనం చేసి వెళ్లవచ్చు .... " అంటూ మరోవైపుకు వెళ్లిపోయాడు.

శ్రీహరిరావు ఈసారి ఆశ్చర్యపడలేదు. పొద్దున అతని తల్లి ఆమాట అన్నప్పుడు అతనికి ఆ విషయం కొత్తగా తోచి అతడు ఆశ్చర్యపడిపోయిన మాట నిజమే. ఆయన మాటాడిన తర్వాత ఉదాసీనంగా నవ్వుకుంటూ వీథిలోకి వచ్చాడు. అతనికి దుర్గ జ్ఞాపకం వచ్చింది. ఆపిల్లకూ, అతనికీ మధ్య చనువూ, స్నేహమూ ఎప్పుడూ లేవు .... పెద్దల మనసులలో యీ ప్రస్తావన మొదటినుంచీ ఉందేమో కాని వారికీ వీరికీ మొదటినుంచీ రాకపోకలు తక్కువ కావడంవల్ల వీ రిద్దరికీ మధ్య ఎటువంటి పరిచయమూ ఏర్పడలేదు. ఇటీవల శ్రీహరిరావు వారి యింటికి వెళ్లినప్పుడు ఆమె కదలికలూ, పద్ధతీ అంతా చాలా ముభావంగా కనిపించాయి. ఆమె అన్ని రోజులూ అతనితో పెదవి కదిపి ఒక్కమాట కూడా ఆడలేదు. అందువల్ల ఆమె తనను గురించి ఏమనుకుంటున్నదో అతనిలికి తెలియదు. తన కామెపట్ల ప్రత్యేకంగా ఏ భావమూ లేదు .... అయినా పెళ్లి ప్రసక్తి వచ్చినప్పుడు "ఇప్పట్లో చేసుకోనంటే తీరిపోతుంది" అనుకున్నా డతడు.... కాని, అతనిలో పెద్ద లోపం ఏమిటంటే తనేమి అనుకుంటున్నాడో ఎదుటివారికి చెప్పలేక పోవడం .... అవతలివారు ఒత్తిడిచేస్తూ రెండు మాటలు అనగానే లొంగిపోవడం.

మొదటినుంచీ యీ లక్షణాలవల్లే అతడు చెడిపోయాడు. అతడు లొంగనిదల్లా ఇంతవరకూ ఒక్క విషయంలోనే. ఉద్యోగంలో మామూళ్ళ (అంటే లంచాలు కాదూ ?) తీసుకోవటం మాత్రం అతనికి చాతకాదు. అది కేవలం భయం వల్లనే కావచ్చు. ఆ విషయంలో మాత్రం ఎదుటివా రెంత ఒత్తిడిచేస్తే తర్వాతి జీవితంలో దానిపట్ల అంత విముఖుడవుతూ వచ్చాడు.

కొన్నాళ్ళ తర్వాత ఒక మంచిరోజు నిర్ణయం అయింది. ఆనాడు సరిగా రాత్రి ఏడు గంటలవేళ బయలుదేరి ఎద్దుల బండిలో సామానుతో సహా స్టేషనుకు చేరుకుని పదకొండు గంటల బండి అందుకునేట్టు నిర్ణయం జరిగింది. వీరయ్య వారికి బాగా సహాయం చేశాడు. ఆ ఏటి తాలూకు మక్తా సొమ్ము రైతు దగ్గర ఒకటికి రెండుసార్లు తిరిగి సాధించుకు వచ్చాడు. అతడే ఎద్దుబండి కూడా మాట్లాడి సిద్ధంగా ఉంచాడు.

ఆనాడు ఉదయం శ్రీహరిరావు పంచలో నిలబడి ఉండగా కరణంగారి యింటిముందు నుంచి రెండు బండ్లు బయలుదేరుతూ ఉన్నాయి. ఎవరో మంచి శకునం చూసుకుని ప్రయాణ మవుతున్నట్టున్నారు. బండ్లు దగ్గరగా వస్తున్నకొద్దీ శ్రీహరిరావు ఉత్కంఠతో అటే చూశాడు. తమ యింటిముందుకు వచ్చేసరికి ముందు బండిలో పెళ్లి కూతురూ, పెళ్లికొడుకూ, కరణంగారూ, మరెవరో యిద్దరు ఆడవాళ్లూ కనిపించారు. వెనక బండీలో ఏదో సామాను వస్తున్నది.

అతడు పరధ్యానంగానే దూరదూరంగా ఆ బండి వెంట నడిచాడు. ఆ నాలుగుమైళ్ల దూరమూ అలాగే నడిచి వారితోపాటు స్టేషనుకు చేరుకున్నాడు. వా రక్కడికి వెళ్లిన కొద్ది నిముషాలకే రైలు రావడంతో బండివాళ్లు త్వర త్వరగా సామాన్లన్నీ రైల్లో ఎక్కించారు. వధూవరులూ కరణంగారూ, మిగిలిన యిద్దరు ఆడవాళ్లు ఒక పెట్టెలో ఎక్కి కూర్చున్నారు. శ్రీహరిరావు స్టేషను బయట నిలబడి కటకటాలలోనుంచి చూస్తున్నాడు. ఆమె కిటికీ ప్రక్కన కూర్చున్నది. ఆమె కెదురుగా ఆమె భర్త కూర్చున్నాడు. శ్రీహరిరావు మరెవరినీ చూడటంలేదు. కేవలం వైదేహి ముఖపద్మం మీదనే అతని చూపుల తుమ్మెదలు నిలిచి ఉన్నాయి. ఆ చూపులలో యిప్పుడు చిత్రమైన గౌరవభావం తప్ప మరేమీ లేదు. అలా ఎంతోసేపో లేదు. రైలు కూత వేసి ముందు నెమ్మదిగా కదిలి తర్వాత వేగంగా, మరింత వేగంగా పరుగెత్తుతూ కొద్ది క్షణాలలోనే కనుచూపుమేర దాటిపోయింది. శ్రీహరిరావు ఆ రైలు ఒదిలిన పొగ కూడా కనుపించనంతవరకూ చూసి తర్వాత వెనుదిరిగి పొలంగట్ల వెంట అడ్డదారిన పడి యింటికి చేరుకున్నాడు.

ఆనాడు పొద్దు గూకుతున్న సమయంలో వారి యింటి ముందు బండి వచ్చి ఆగింది. వీరయ్య సామానులను ఒక్కొక్కటిగా తెచ్చి బండిలో ఉంచి 'అమ్మా! ఇక కదిలి రండి .... ఆలస్యం కాకూడదు .... ' అంటున్నాడు. శ్రీహరిరావు యివతలికి వచ్చాడు. అతని తల్లి లోపలినుంచి నెమ్మదిగా యివతలికి వచ్చి తాళంవేసి ఎందుకో శిలాప్రతిమలా అలాగే నిలబడిపోయింది. ఒక్క క్షణం తర్వాత వీరయ్య కేక విని మాటిమాటికీ వెనుదిరిగిచూస్తూ ఆ విశాలావరణలో నడిచివచ్చి బండి ఎక్కి కూర్చుంది. ఆమె కళ్లవెంట ధారాపాతంగా అశ్రువులు రాలుతూ ఉంటే "అదేమిటమ్మా ఊరుకో" అన్నాడు శ్రీహరిరావు.

వీరయ్య అలాగే నిలబడి "తప్పు తల్లీ! అలా కంట తడి పెట్టకూడదు. ఇంటికొచ్చిన దిగులేమీ లేదు. మన ఊరికి కొత్తగా వచ్చిన బడిపంతులు ఉంటానన్నాడు. ఉండమన్నాను. మన క్కావలసింది అద్దె కాదు .... రోజూ యింటి ముందు చిమ్మి ముగ్గుపెట్టి, పొద్దు గూకగానే దీపం వెలిగించేవాళ్లు కావాలి .... ఆయన యింటిని నిక్షేపంలా చూసుకుంటాడు. తాళంచెవి యిలా యివ్వు ...." అన్నాడు.

ఆమె తలఊపి కళ్లు తుడుచుకుని శ్రీహరిరావుచేత తాళంచెవి అతని కిప్పించింది. వీరయ్య తన కొడుక్కు దాన్ని యిచ్చి 'మీ అమ్మ కివ్వరా' అని పంపించి వీథి చివరకు చూసి "అదుగో రత్తమ్మగారు .... మంచి శకునం ...." అని ఎగిరి గంతేసి బండి ఎక్కి ఎద్దులను అదిలించాడు. అవి మెడలో మువ్వలు 'గణగణ' మ్రోగుతూ ఉండగా వేగంగా నడవటం ప్రారంభించాయి.

శ్రీహరిరావుకు తాను చిన్నతనం నుంచి ఆడుకున్న స్థలాలూ, తిరిగిన స్థలాలూ వెనుకబడి పోతూవుంటే కొంచెం దిగులు కలిగింది. అయినా తమాయించుకున్నాడు. తాను యిప్పుడు దిగులుపడితే ఎలా ? ఇంకా ఈవిధంగా ఎన్ని వూళ్లు, ఎన్ని స్థలాలు, ఎన్ని ఉద్యోగాలు మారవలసి ఉంటుందో. అతని తల్లి మాత్రం ఉండి ఉండి కళ్ల నీళ్లు తుడుచుకుంటూనే ఉంది.

స్టేషనులో బండి కదులుతూ ఉండగా వీరయ్య "అప్పుడప్పుడు వస్తూ ఉండండి .... మరిచిపోవద్దు" అంటూ చేయి ఊపుతూ నిలబడ్డాడు. అతని కళ్లలోనూ ఎందుకో నీటి పొర నిలిచింది. తల్లి సరేసరి .... దుఃఖం ఆపలేక ఒక్కసారిగా ఆమె పమిటకొంగులో మొహం దాచుకుంది. కొద్దిసేపటికే రైలు ఆ పరిసరాలనూ, పచ్చని పొలాలనూ, ఊళ్లనూ వెనక వదిలి పరుగు ప్రారంభించింది.

వారు చేరవలసిన ఊరు చేరుకుని కొత్త యింట్లో ప్రవేశించారు. ఇల్లంతా కలిసి రెండే రెండు గదులు. మట్టి గోడలు. మట్టినేల. అతనికి కొత్తలో ఉత్సాహం యిచ్చింది తన పని ఒకటే. అతడు ముందుగా వెళ్లి ఆ లాయరుగారితో మాట్లాడి వచ్చాడు. ఆయన అతన్ని 'మరునాటి నుంచే పనిలోకి రమ్మ' న్నాడు.

మరునాడు ఉదయం బయలుదేరబోతూఉండగా వీపున చొక్కా చిరిగి ఉండటం గమనించాడు. వెంటనే తల్లిని పిలిచి చూపించి 'కొంచెం కుట్టిపెట్టవమ్మా' అన్నాడు. ఆమె ఆ చొక్కా అలాగే తొడుక్కోమని చెప్పి పెద్ద పెట్టెలో వెదకి ఒక కోటు తీసుకువచ్చి అతనికి తొడిగింది. అది అతని తండ్రిది. ఆయన 'పెద్ద పెద్ద కచేరీలకు వెళ్లినప్పుడు ఉంటుంది లెమ్మ' ని ఎప్పుడో కుట్టించుకున్న కోటు అది. ఆయన తర్వాత దాన్ని ఎన్నడూ తొడుక్కోనే లేదు. అది అలాగే పెట్టె అడుగున ఉండిపోయింది.

అతడా కోటు తొడుక్కుని పనిలో ప్రవేశించాడు. ఇక ఆనాటి నుంచి దాదాపు ఎనిమిది నెలల వరకు అదే పని. రోజూ లాయరుగారి యింట్లో పంచలో మూలగా చిన్న డస్కు ముందు కూర్చుని వరుసగా రకరకాల కాయితాలకు కాపీలు తీస్తూ ఉండేవాడు. మొదట్లో ఆపని ఉత్సాహం తోనే చేసేవాడు. కాని రాను రాను అంత కష్టమైన పని మరొకటి ఉండదనిపించేది. ఇక అతడు వారినీ వీరినీ ఆశ్రయిస్తూనే, యితర ప్రయత్నాలు చేస్తూనే రకరకాల ఉద్యోగాలకు అప్లయి చేస్తూనే పని కొనసాగించాడు. దాదాపు ఎనిమిది నెలల తర్వాత అతనిమీద అభిమానంతో ఒక పెద్ద మనిషి చేసిన ప్రయత్నాలు ఫలించినందువల్ల అతనికి అరవై మూడు రూపాయల వేతనంతో ప్రభుత్వంవారి కరుణతో యిచ్చిన ఉద్యోగం లభించింది. ఇక అప్పటినుంచీ అతని కదే దిక్కయింది. ఆ ఉద్యోగంలోనే అనేకమైన ఊళ్లు మారాడు. రకరకాల వ్యక్తులతో పరిచయం లభించింది. రకరకాల పై ఉద్యోగులు అతనిపట్ల రకరకాలుగా ప్రవర్తించారు. అతని జీవితం ఎదుగూ బొదుగూ లేకుండా అలాగే నెమ్మదిగా జరిగిపోతున్నది.

## 4

నాలుగవ అరగంట అయిపోయినట్టు సూచిస్తూ గణగణ మని బెల్ మ్రోగుతున్నది. శ్రీహరిరావు మళ్లీ యీ ప్రపంచంలోకి వచ్చాడు. హాల్లో కొద్దిమంది పేపర్లిచ్చేసి వెళ్లిపోయినట్టున్నారు. తన ప్రక్కనున్న జమీందార్ల అబ్బాయి యిప్పుడే లేచి వెళ్లిపోతున్నాడు. మొదటి వరుసలో ఆడపిల్ల కలం పళ్లమధ్య ఉంచుకుని దేన్ని గురించో దీర్ఘంగా ఆలోచిస్తున్నది. వాచర్లిద్దరూ చెరొకవైపూ కుర్చీలలో కూర్చొని ఉన్నారు. శ్రీహరిరావు తన ముందున్న పేపరు గాలి కెగిరిపోతూవుంటే దాన్ని పట్టుకుని ఆపి తన కలాన్ని జేబులో నుంచి తీసి దానిమీద బరువుగా ఉంచాడు. తర్వాత పైకప్పు వంక చూస్తూ కూర్చున్నాడు.

తనకు గవర్నమెంటు ఉద్యోగం దొరికిందని వినగానే తల్లీ, మేనమామా, ఆయన భార్యా అందరూ ఎంతగానో సంతోషించారు. అవును మరి. ఆ రోజులలో ఆ ఉద్యోగం, ఆ జీతమూ, నిజంగానే అందరి దృష్టిలోనూ గొప్పగా ఉండేవి. ఇక దుర్గ .... ఆమె ఆ రోజులలో ఏమనుకున్నదో ఆమెకే తెలియాలి.

తన మేనమామ నెమ్మది నెమ్మదిగా తన తల్లితో పెళ్లి ప్రస్తావన తీసుకురావడం శ్రీహరిరావు గమనించాడు. అయినా పట్టించుకోనట్టు తప్పుకు తిరిగాడు. కాని అలా ఎన్నాళ్లో తప్పుకునేందుకు వీలులేకపోయింది. కొత్త ఉద్యోగంలో చేరి రెండు నెలలపాటు జీతం తీసుకునేసరికి పెళ్లి విషయం బాగా బహిరంగంగానే చర్చకు వచ్చింది. అతని మేనత్త వారి యింటికి వచ్చినప్పుడల్లా "ఏమయ్యా! శ్రీహరీ! ముహూర్తం పెట్టించమంటావా ?" అని అడుగుతూ ఉండేది. అతడు బలవంతంగా నవ్వి ఏ సమాధానమూ చెప్ప కుండా ఎటో పోయేవాడు.

ఒకనాడు అతని అత్తమామ లిద్దరూ మాట యిచ్చి పుచ్చుకోవడం కోసం వచ్చి కూర్చున్నారు. శ్రీహరిరావు తల్లి తనమీద ఏమీ భారం ఉంచుకోకుండా "పిల్లల కిష్టమైతే నా అభ్యంతరం ఏమీలేదు" అన్నది.

అప్పుడు మేనమామ "ఏమిరా నాయనా! మీ అమ్మ భారమంతా నీమీదే పెట్టింది. ఏం చెబుతావు ?" అని అడిగాడు.

శ్రీహరిరావు యిబ్బందిలో పడి నెమ్మదిగా "ఇప్పుడు పెళ్లికేం తొందర ? ఇప్పుడు వద్దు...." అన్నాడు.

అతని మేనమామ గబగబా "అదేమన్నమాట ? ఏ యీడులో జరుగవలసిన ముచ్చటలా యీడులో జరిగిపోవాలి. నువ్వు ఊఁ!' అనడమే తరువాయి" అన్నాడు.

శ్రీహరి సందేహిస్తూ తల వంచుకుని ఉండగా అతని తల్లి "ఇంతకీ దుర్గ ఏమంటుందో కనుక్కున్నావుట్రా తమ్ముడూ" అని అడగటం అతనికెంతో సంతోషం కలిగించింది. పిల్ల తల్లి ఆమాట విని "ఆఁ! పసిపిల్ల .... దాని యిష్టాని కేముంచె .... మనం పెద్దలం నిర్ణయిస్తే అది కాదంటుందా ?" అన్నది. శ్రీహరిరావు దానితో యిరుకున పడినప్పటికీ, చివరకు తలవూపక తప్పలేదు.

పెళ్లి ప్రయత్నాలు జరుగుతూ ఉండగా దుర్గ మాటి మాటికీ చిరాకుపడుతూ ఉండటమూ, ఎప్పుడూ ఒంటరిగా కూర్చుంటూ ఉండటమూ, ఎవరైనా పలకరిస్తే విసుక్కోవడమూ, అవీ యివీ విసిరికొడుతూ ఉండటమూ సాగించింది. అయినా ఆమె తల్లిదండ్రు లివేమీ పట్టించుకోలేదు. ఆమె నోరు విప్పి వారితో "నాకీ సంబంధం యిష్టంలేదు" ని ఎలా చెప్పగలదు ? అలా ఆమె చూస్తూవుండగానే జరగవలసినవన్నీ జరిగిపోయాయి.

అయితే శ్రీహరిరావు మనసును కలతపెట్టిన విషయాలు కొన్ని ఉన్నాయి. పెళ్లిలో దుర్గ తలంబ్రాలు పోయవలసిన ఘట్టంలో మెదలకుండా కూర్చుంది. బంగారం ముక్క

లుగా కొట్టిపోసినట్టున్న అక్షతలు తాను రెండు చేతులతోనూ ఎత్తి దుర్గ కబరీభరంమీద పోశాడు. అవి ఆమె ధరించిన మధుపర్కాలమీద తళతళ లాడుతూ మిలమిల లాడుతూ బంగారపు ముక్కలవలెనే కాంతు లీనుతూ పడి జారిపోయాయి. ప్రతిగా ఆమె పోయవలసి ఉండి కూడా మెదలకుండా కూర్చున్నది. పురోహితుడూ, పెద్దలూ రెండు మూడుపార్లు చెప్పి చూసినా లాభంలేకపోయింది. అంతటితో ఆ ముచ్చట తీరిపోయింది.

తర్వాత తలుపుల దగ్గర పేర్లు చెప్పవలసినచోట తాను కొంచెంసేపు బెట్టు చేసినా చివరకు లొంగి శ్రీహరిరావు 'దుర్గ' అని చెప్పివేశాడు. కాని దుర్గచేత మాత్రం భర్తపేరు ఎవరూ చెప్పించలేకపోయారు. వారూ వీరూ "అమ్మా ! చెప్పుతల్లీ. లేకపోతే తప్పు...." అని ఎంతగా బతిమాలినా కొయ్యబొమ్మలా నిలబడిపోయిందే గాని ఆపిల్ల తన సొమ్మేం పోతుందనో పెదవి కదపనైనా లేదు. చివరకు ఆమె తల్లికి కోపంవచ్చి కఠినంగా మాట్లాడగా నిశ్శబ్దంగా ఏడుపు సాగించింది .... దానితో అందరూ "సరే .... ముచ్చటల కేమొచ్చెలే .... ఏడుపు లెందుకు .... ఫరవాలేదు. లోపలికి రండి" అని సర్దుబాటు చేశారు. "చిన్నతనం లెమ్మ" ని అనుకున్నా రందరూ.

శ్రీహరిరావుకు నవ్వు వచ్చింది పై వృత్తాంతం తలుచుకోగానే.... దుర్గ స్వతహాగా మంచిదే .... ఆమెకు అంతరాంతరాల్లో తనపట్ల గాఢమైన అభిమానమూ ఉన్నదని అతనికి తెలుసు. కాని ఆమెలో ఏదో అసంతృప్తి. ఇప్పటికీ ఎప్పుడూ నిశ్శబ్దంగా ఉంటుంది. పిల్లలమీద ప్రేమానురాగాలున్నప్పటికీ ఒక్కొక్కప్పుడు వాళ్లను చావగొడుతూ ఉంటుంది. ఆమెకు నగలమీదా, ఖరీదైన చీరెలమీదా, భోగభాగ్యాలమీదా ఉన్న మోజు యిప్పటికీ తీరలేదు. అది యిప్పట్లో—అంటే యీ తరంలోనే—తీరేదీ కాదు. తాను మాత్రం ఏం చేయగలడు ?

తర్వాత పిల్లలూ, సంసారం, ఎప్పుడూ ఎవరికో ఒకళ్లకు జబ్బులూ, ఉద్యోగంలో బదిలీలు, చాలీచాలని, యింక్రిమెంట్లు లేని జీతమూ, యివన్నీ అతనికి మనస్తాపం కలిగించినవే. పిల్లలు నలుగురిలో విడుపులేకుండా ఎప్పుడూ ఎవరికో ఒకరికి దగ్గో, పడిశమో, జ్వరమో .... తాను మూడు రోజుల క్రితం యిక్కడికి వచ్చేటప్పటికి రెండోపిల్ల కోరింత దగ్గుతో విపరీతంగా బాధపడుతున్నది. ఆపిల్ల దగ్గుతో మెలికలు తిరిగిపోతూ ఆయాసంతో బాధపడుతూఉంటే అతని తల్లి ఎవరి దగ్గరకో తీసుకుపోయి మెళ్లో ఒక పసుపు తాడు వేయించుకు వచ్చింది. అయినా దగ్గు తగ్గలేదు. ఇప్పుడెలా ఉందో ఏమిటో. పైగా వర్షాలు. చలిగాలికి ఆ దగ్గుతో మరింత బాధ.....

* * *

ముందు బల్లమీద జేబు రుమాలు పెట్టుకుని దొంగ చూపులు చూస్తున్న కుర్రవాడు రుమాలు మడతలు విప్పి మొహం తుడుచుకుంటున్నట్టు నటిస్తూ తాను వ్రాసుకుని వచ్చిన కాయితాలను మెల్లిగా ఆన్సర్ బుక్ క్రిందికి చేర్చుకున్నాడు. తర్వాత తీరికగా సిద్ధాంతాలు కాపీకొట్టడం ప్రారంభించాడు. తర్వాత కొద్ది నిముషాలకు వాచర్ అతన్ని గమనించి పట్టుకుని పేపరు లాక్కొని బయటికి 'వెళ్లిపొమ్మ' న్నాడు. వాడేదో చెప్పబోతే వినకుండా 'గెటవుట్' అని అరిచాడు. అతడు నెమ్మదిగా, దిగులుగా బయటికి వెళ్లిపోయాడు.

హాల్లో అందరూ తలెత్తి అటు చూశారు. అతడు బయటికి వెళ్లిపోగానే అందరూ మళ్లీ తమ తమ పనులలో లీనమైనారు.

శ్రీహరిరావుకు ఆదుర్దా కలిగింది. మళ్లీ పేపరు చేతిలోకి తీసుకుని అన్ని లెక్కలూ చదివి 'ఏ ఒక్కటయినా లొంగకపోతుందా' అని మళ్లీ ప్రయత్నించాడు కాని, ఏమీ ప్రయోజనం కనిపించలేదు. చివరకు విసుగెత్తి పెన్ను బల్లమీద ఉంచి నుదుటిని అరచేత్తో రుద్దుకుంటూ అలాగే కూర్చుండిపోయాడు.

రవి లెక్కలు చెయ్యటం పూర్తిచేశాడు. తిరిగి ఒక్కసారి తాను వ్రాసినదంతా మళ్లీ చూసుకున్నాడు. ప్రశ్నపత్రం మడిచి జేబులో ఉంచుకున్నాడు. కలం మూసి ఆన్సర్ బుక్‌మీద ఉంచి వెనక్కు తిరిగి చూశాడు. అతనికి శ్రీహరిరావు మ్లానవదనంతో దీనంగా నుదుట చెయ్యి ఆనించుకుని కనిపించాడు. అతని ముందున్న పేపరు అర్థం పర్థంలేని కొట్టివేతలతో నిండివుంది..... రవికి జాలి కలిగింది.

శ్రీహరిరావుకు ఎవరో కాలిమీద గీకుతున్నట్టయింది. అతడు కళ్లు తెరిచి చూసేసరికి రవి ముఖం పక్కకు తిప్పి కళ్లతోనే సైగచేసి తాను కొంచెం పక్కకు తిరిగి, పేపరు మళ్లీ చూసుకుంటున్నట్టు నటిస్తూ సిద్ధాంతాలు వ్రాసి ఉన్న పేజీలు తిప్పాడు.

శ్రీహరిరావుకు అర్థమైంది. ఎదురుగా ముత్యాలకోవ వంటి దస్తూరీతో, శుభ్రంగా గీయబడిన త్రిభుజం బొమ్మలతో రెండు సిద్ధాంతాలు అతనికి కనుపిస్తున్నాయి. అవి అతన్ని ఆశ పెడుతున్నాయి .... ఒకసారి మొహం తిప్పుకున్నాడు .... మళ్లీ అటే చూశాడు .... రెండు సిద్ధాంతాలకూ ఒక్కొక్కదానికి పదకొండు మార్కుల చొప్పున మొత్తం ఇరవైరెండు మార్కులు .... మరొక రెండు లెక్కలు చూసి చెయ్యగలిగితే మరొక పదహారు. మొత్తం ముప్పయి ఎనిమిది మార్కులు .... చాలు తాను ప్యాసైపోతాడు. మిగిలిన పరీక్షలు తన కసలు లెక్కలోవి కావు, ఈ లెక్కలతోనే పేచీ అంతా .... ఇలా చెయ్యగలిగితే తాను గట్టెక్కిపోతాడు.... దానివల్ల ప్రమోషన్ .... మరొక పాతికా ముప్పయి రూపాయల అదనపు రాబడి....

అతనికి విపరీతంగా చెమట పోస్తున్నది. ఎడమచేత్తో రుమాలుతో మొహం తుడుచుకుంటూ ఒణుకుతున్న కుడి చేత్తో కలం అందుకున్నాడు .... ఎదుటి పేపరులోకి చూశాడు. మళ్లీ తల తిప్పుకున్నాడు. మళ్లీ చూశాడు. ఒక్క క్షణం తర్వాత 'ఛీ' అనుకుని కలం బల్లమీద ఉంచేసి మనసు మార్చుకున్నాడు.

అయినా అతని గ్రహచారం బాగులేదు. ఒక వాచర్ గబగబ నడిచి వచ్చాడు. రవి సర్దుకు కూర్చున్నాడు. ఆయన నేరుగా శ్రీహరిరావు దగ్గరికి వచ్చి "ఏమండీ! ఏమిటి మీరు చేస్తున్నపని ? ఆ పసివాడి దగ్గర కాపీ చేస్తున్నారా ? ఇన్నేళ్ళు వచ్చాయి. అమాత్రం రియలైజేషన్ లేదేమండీ.... ఈసారికి దయతలిచి వదులుతున్నాను. లేకపోతే యిద్దర్నీ బైటికి గెంటించి ఉందును. కూర్చోండి" అని గద్దించాడు.

ఆయన దగ్గరకు రాగానే శ్రీహరిరావు తన సంకల్పం లేకుండానే నిలబడ్డాడు. ఆయన అలా గద్దిస్తూవుంటే దిగ్భ్రమచెంది కొయ్యబొమ్మలా నిలబడిపోయాడు. లోపల మనసంతా కుతకుతలాడిపోయింది. విపరీతంగా బాధపడిపోయాడు. అవమానంతో మొహం కందగడ్డ అయిపోయింది. చేతులతో మొహం కప్పుకుని కూలబడిపోయాడు.

అతడు బయటికి వెళ్లిపోదా మనుకున్నాడు. కాని ఇది సమయం కాదు. అందరూ యీ గోలకు తన వంకకే చూసి సర్దుబాటు కాగానే మళ్లీ తమ తమ పనుల్లో మునిగిపోయి ఉన్నారు. తా నిప్పుడు లేచి బయలుదేరితే మళ్లీ అందరూ తనను చూస్తారు. ఆ చూపులను తాను భరించలేడు. అందు వల్ల యిలా కూర్చోడమే మంచిదనిపించింది. అయినా చండ నిప్పులమీద కూర్చున్నట్టుగా ఉంది. లోపల మనసేమో అవ మానంతో జ్వలించిపోతున్నది.

కొద్ది నిముషాల అనంతరం చివరి బెల్ మ్రోగింది. అంతా బిలబిల లాడుతూ లేచి యివతలికి వస్తున్నారు. శ్రీహరిరావు అందర్నీ తప్పుకుంటూ వంచలోకి వచ్చి ఒక్క సారి గుండెల నిండుగా గాలి పీల్చుకున్నాడు. అక్కడ స్తంభాని కానుకుని రవికోసం ఎదురుచూస్తూ నిలబడ్డాడు. రవి యివత లికి వచ్చాడేగాని వారినీ వీరినీ అడిగి తన లెక్కల అన్సర్లు రిఫర్ చేసుకుంటున్నాడు.

శ్రీహరిరావు చాలా అసహనంగా ఉన్నాడు. అందుకు ఒక కారణం విపరీతమైన ఆకలి .... రెండవది సరేసరి .... అనుకుంటేనే బాధగా ఉంది.

రవి అతనివైపు నడిచివచ్చాడు. అతని లెక్కలన్నీ రైటయినాయి. అతడు పేపరు మడిచి జేబులో పెట్టు కుంటూ సానుభూతితో శ్రీహరిరావువంక చూసి "ఏమైనా ప్రయత్నం చేశారా ?" అని అడిగాడు.

శ్రీహరిరావు తల ఊపి "చేశాను. కాని ఏం లాభం..." అన్నాడు. ఇద్దరూ నడవటం ప్రారంభించారు.

శ్రీహరిరావు నెమ్మదిగా "ఇవాళ ఒక లెక్క కూడా చెయ్యకుండా పేపరు యిచ్చాను.... ఇక మిగిలిన పరీక్షలు వ్రాయడం దేనికీ ? దండుగ .... నేను మధ్యాహ్నం బండికే బయలుదేరి వూరికి వెళ్లిపోతాను" అన్నాడు.

రవి అది విని "ఈసారి లెక్కలు తీసుకోవద్దు మేస్టారూ ! ఏ సివిక్సో, హిస్టరీయో తీసుకోండి" అన్నాడు.

శ్రీహరిరావు మనసులో "ఇక ఈ పరీక్షకు వచ్చేదీ లేదు. వ్రాసేదీ లేదు. మళ్లీ ఫీజు కట్టేందుకు శక్తి చాల వద్దూ. ఉన్న ఒక్క ఉంగరమూ దీనికే చెల్లిపోయింది. ఇంకా ఉంగరాలు తన దగ్గర కుప్పపోసి లేవుగా ...." అనుకున్నాడు.

ఇద్దరూ బస్సులో కూడా నిశ్శబ్దంగా కూర్చున్నారు. బస్సు దిగగానే కొంతదూరం నడిచిన తర్వాత రవి ఒక ఇంటిముందు ఆగి "ఇదే మా యిల్లు. లోపలికి రండి" చూసి ఒక్క నిముషం కూర్చుని వెళ్లవచ్చు" అన్నాడు.

శ్రీహరిరావుకు ఆకలిగా ఉంది. "ఏపాటు తప్పినా సాపాటు తప్పదుగా .... అయినా సరే ఈ కుర్రవాణ్ణి నిరు త్సాహపరచటం దేనికీ. ఒక్క నిముషం ఆగి వెంటనే వెళ్లి పోదాం" అనుకుని అతడు రవి వెంట లోపలికి వెళ్లాడు.

అది పెద్ద యిల్లు. ముందు గదిలో పేము కుర్చీలూ, ఒక గుండ్రని ఖరీదైన బల్లా, రేడియో, ఫంకా, గుమ్మా లకు పలుచని తెరలూ అంతా ఒక పెద్ద ఆఫీసరు యిల్లని చెప్పక చెబుతున్నాయి.

రవి అతన్ని ముందు గదిలో కూర్చోబెట్టి "ఉండండి. ఇప్పుడే వస్తాను" అంటూ లోపలికి వెళ్లాడు. శ్రీహరిరావు కుర్చీలో కూర్చుని చుట్టూ చూశాడు.... ఏవ్రక్క చూసినా చక్కని అలంకరణ కనిపిస్తున్నది. అక్కడ కూర్చుంటే మనసుకు ఏదో చక్కని అనుభూతి కలుగుతున్నది. ఎంద రెందరో సంపన్నులు ఉన్నారు. లక్షాధికారు లున్నారు. అయినా యింటిని శుభ్రంగా అందంగా ఉంచుకోవడం ఒక కళ .... డబ్బున్నంతమాత్రంలో అది రాదు. తన ఊరిలో తమ వీథిలో ఉంటున్న వడ్డీ వ్యాపారికీ ఉంది లక్షలకొద్దీ డబ్బు. ఉండి ఏం ప్రయోజనం ? ఇల్లు ఇరకాటం .... సన్నగా పొడుగ్గా ఉంటుంది. గాలీ, వెలుతురూ రాదు.

కుడివైపు గోడమీద వ్రేలాడుతున్న ఛాయాచిత్రం అతని దృష్టి నాకర్షించింది. వారేనేమో రవి తల్లిదండ్రులు. అతడు లేచి దగ్గరకు వెళ్లి చూశాడు .... రవి తండ్రి మంచి తేజస్వి. ఠీవీ, హోదా ఆయన ముఖంలో ఉట్టి పడుతున్నాయి. ఆ ప్రక్కనే రవి తల్లి కాబోలు కుర్చీమీద ఒక చెయ్యి ఆనించుకుని నిలబడి ఉంది. ఆ ముఖం తనకు పరిచితమైనదిగా తోచింది. అవును. ఈమెను తాను ఎక్కడో చూశాడు. ఎక్కడ ? ఏమో గుర్తు రావటంలేదు.

ఇంతలో రవి ఆ గదిలోకి ఫ్లాస్కుతో గాజు గ్లాసుతో వచ్చి కాఫీ గ్లాసులోకి వంచుతూ "మేష్టారూ ! కొంచెం కాఫీ తీసుకోండి" అన్నాడు.

శ్రీహరిరావు వెనుదిరిగి చూసి "ఇప్పుడు కాఫీ ఏమిటి? ఇంటిదగ్గర నాకోసం కనిపెట్టుకుని ఉంటారు. భోజనంవేళ అయిందికదా ?" అన్నాడు.

గుమ్మం వెనక రవి తల్లి నిలబడి ఉంది. కర్టెన్ ఒకచేత్తో తొలగించి పట్టుకుని ఆమె "ఫరవాలేదు. తీసుకోండి" అన్నది. శ్రీహరిరావు గ్లాసు అందుకుని కుర్చీలో కూర్చున్నాడు.

రవి గుమ్మంవైపు తిరిగి "నేను చెప్పలేదూ అమ్మా ? ఆయనే వీరు" అన్నాడు.

ఆమె అలాగే నిలబడి రవితో 'అలాగా' అని శ్రీహరిరావు వంక తిరిగి "నిన్న రాత్రి వీడు ఒంటిగంట వరకూ యింటికి రాకపోయేసరికి నేను దిగులుపడిపోయానండీ. ఇక ఉండబట్టలేక వాళ్ల నాన్నగారిని లేపి పంపబోతూ ఉండగా వీడు ఎదురు వచ్చాడు. వీడికంటె పెద్దవాళ్లిద్దరూ గుంటూరులో కాలేజీల్లో చదువుతూ హాస్టళ్లలో ఉంటున్నారు .... ప్రస్తుతం నాదగ్గర ఉన్నది వీ డొక్కడే .... అందుకని నిన్న రాత్రి బాగా గాభరాపడిపోయాము" అన్నది.

శ్రీహరిరావు గ్లాసు ఎదురుగా ఉన్న బల్లమీద ఉంచి తల ఎత్తి చూసి "మీ అబ్బాయి చాలా తెలివైనవాడండీ. నాకు చాలా సహాయం చేశాడు కూడాను. అది ఫలించలేదు కాని ...." అన్నాడు.

ఆమె "అదేమి టన్న"ట్టు చూసింది. రవి మాట్లాడలేదు. శ్రీహరిరావు "ఇక వెళ్ళి వస్తానండీ. మా అక్కగారు నాకోసం ఎదురుచూస్తూ ఉంటుంది. పైగా బండివేళ కూడా అవుతున్నది" అంటూ లేచాడు.

ఇంతలో చిలిపి విసురుగాలి తరంగం ఒకటి రివ్వున వీచింది. గుమ్మంలో నిలబడిఉన్న ఆమె ఒక్కసారి నుదుట పడుతున్న నల్లని ముంగురులను బంగారపు పుల్లలవంటి సన్నని వ్రేళ్లతో పైకి తోసుకున్నది.

శ్రీహరిరావు మెదడులో మెరుపు మెరిసినట్లయింది. అతడు క్షణంలో సగంలోనే మళ్లీ ఆమెవంక చూశాడు. ఆ కళ్లు అతని కెవరినో గుర్తు చేశాయి. ఆమె ... వైదేహి... సందేహం ఏమాత్రం లేదు.

అతడు మెట్లుదిగి బయటకు వచ్చాడు. ఎందుకో కాళ్లు తడబడ్డాయి. తమాయించుకున్నాడు. తనవెంట వాకిలి దాకా వచ్చిన రవిని భుజంతట్టి వాత్సల్యం కురిసే కన్నులతో "బాగా చదువుకో" అని చెప్పి త్వరత్వరగా సాగిపోయాడు. ఆతర్వాత కొద్ది నిముషాలలోనే అతడిల్లు చేరుకుని భోజనం చేస్తూవుండగా అకస్మాత్తుగా మేఘాలు క్రమ్ముకువచ్చి అయిదే అయిదు నిముషాలసేపు వర్షం కురిసింది.

మరొక గంట తర్వాత అతడు పక్క గుడ్డలు మడత పెట్టుకుని, తాటితో కట్టుకుని, చేతిసంచి సర్దుకుని ప్రయాణానికి సిద్ధమయ్యాడు. అతని బావగారు ఇంట్లో లేడు. అక్కడ పేకాటలో పీకలలోతున మునిగిపోయి ఉంటాడు ఇప్పుడు. ఆయనతో చెప్పి వెళ్లే వ్యవధిలేదు. బండి మరొక అరగంటలో వచ్చేస్తుంది. అడ్డదారిన పోతే తప్ప యిప్పుడైనా అందుతుందనే నమ్మకంలేదు. అందువల్ల అతడు గుమ్మంలో ఏదో చెప్పరాని దిగులును గుండెల్లో, కళ్లలో నిలుపుకుంటున్న అక్కగారితో "బావకు నువ్వు చెప్పు. నాకు బండి టైమయింది" అన్నాడు. తర్వాత ఒక చేతిలో పక్క చుట్టతోనూ మరొక చేతిలో సంచీతోనూ అతడు బయటికి వచ్చాడు. అతని అక్కగారు గుమ్మందాకా వచ్చి "ఒరే తమ్ముడూ ! వెళ్లగానే జాబు వ్రాయి. అమ్మను పంపడం మర్చిపోకు" అన్నది గద్గదస్వరంతో.

అతడు త్వరత్వరగా నడిచిపోతున్నాడు. అది స్టేషనుకు అడ్డదారి. ఎత్తయిన గట్టు. అప్పుడే వర్షం పడినందువల్ల బురదతో నిండి జారుతున్నది. అతడు ఒక చేతిలో పక్క చుట్టతో మరొక చేతిలో సంచీతో జాగ్రత్తగా 'బ్యాలెన్సు' చూసుకుంటూ ముందుకు సాగిపోతున్నాడు. అతనికప్పుడు తాను చిన్నతనంలో చూసిన ఒక దొమ్మరి ఆట గుర్తుకు వచ్చింది. అందులో ఒక దృశ్యం. ఒక పచ్చని అందమైన పిల్ల ఎత్తుగా కట్టిఉన్న తీగమీద చేతిలో పొడుగాటి వెదురుబొంగుతో యిలాగే నడిచింది. తా నిప్పుడు చేస్తున్నది కూడా తక్కువ 'ఫీట్' కాదు. ఇలా నడవటం సామాన్యమా ?

పరీక్ష విషయం, తనకు జరిగిన అవమానం విషయం గుర్తుకువచ్చి కొంచెం బాధ కలిగించింది. అయినా "అబ్బే ! ఈమాత్రపుదానికి బాధపడటం పురుషలక్షణం కాదు. ఇంతకుపూర్వం మనం ఎన్ని చేదు మాత్రలు మింగివుండలేదు గనుక ?" అనుకుని హుషారు తెచ్చుకున్నాడు.

అప్రయత్నంగా అతని నోటివెంట యీల వచ్చింది.

---